సంపుటి : 9
సంచిక : 301
శుక్రవారం
24 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE






Contact For Ads:
7579339999


మాజీ మంత్రి అప్పలరాజుకు

## 14 రోజుల రిమాండ్



పలాస, విశ్వం వాయిస్ న్యూస్ : వైకాపా నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు పలాస కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. అప్పలరాజును శ్రీకాకుళం సమీపంలోని అంపోలు జైలుకు తరలించనున్నారు. ఈనెల 10న అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ బైక్‌తో ఢీకొట్టడంతో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసు నుంచి తన కుమారుణ్ని తప్పించేందుకు అప్పలరాజు మిగతా .. 2లో..

తమ్మినేని ముందస్తు బెయిల్ పిటిషన్‌పై

## తీర్పు రిజర్వ్





అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. శ్రీకాకుళంలో రూ.4 కోట్ల విలువైన భూకబ్జా కుట్ర కేసులో తమ్మినేని, ఆయన భార్య వాణి, కుమారుడు వెంకట శ్రీరామ చిరంజీవి నాగ్ నిందితులుగా ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. తమ్మినేని తరఫున న్యాయవాది హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లపై ఇరువర్గాల వాదనలు ముగిశాయి. ఈ అంశంపై ఈనెల 27న హైకోర్టు తీర్పు వెలువరించనుంది.

విద్యార్థుల డిమాండ్లకు

## సంపూర్ణ మద్దతు

రాహుల్ గాంధీ



విశ్వం వాయిస్ న్యూస్ : నీట్ పేపర్ లీకేజీలో బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలకు మద్దతుగా నిలవాలని విపక్ష కూటమి నిర్ణయించింది. రాహుల్ గాంధీ నివాసంలో భేటీ అయి చర్చించిన కూటమి నేతలు.. విద్యార్థుల డిమాండ్లకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం గాంధీ స్మృతి కేంద్రం వద్దకు చేరుకొని మిగతా .. 2లో..



# 'ఏపీ అస్త్రం' ఆవిష్కరణ

- సమర్థవంతమైన పోలీసింగ్ కోసం సర్టిఫికేషన్ కోర్సులు
- హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి
- ఏఐ, డిజిటల్ లిటరసీతో పోలీసు వ్యవస్థను తీర్చిదిద్దాలి
- ప్రజలతో ఫ్రెండ్లీగా... నేరస్థులపై కఠినంగా ఉండాలి
- ఏపీ పోలీస్ రిట్రీట్-2026: ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్రంలో సమర్థవంతమైన పోలీసింగ్ కోసం వివిధ స్థాయిల్లోని పోలీసులకు సర్టిఫికేషన్ కోర్సులను అందించి... వారి సేవలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం పూర్తిగా మారిపోయిందని, అలాంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసు వ్యవస్థను కూడా ఆధునిక సాంకేతికతతో తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో మూడు రోజుల పాటు జరిగిన ఏపీ పోలీస్ రిట్రీట్–2026: ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్ ముగింపు సమావేశం గురువారం జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న సీఎం, రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారులతో కలిసి భవిష్యత్ పోలీసింగ్‌కు అవసరమైన సంస్కరణలపై సమీక్ష నిర్వహించారు. టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), డిజిటల్ లిటరసీ ఆధారంగా భవిష్యత్ పోలీసింగ్‌ను నిర్మించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. 2001లోనే ఇదే తరహాలో ఫ్యూచర్ పోలీసింగ్ వర్క్‌షాప్ నిర్వహించామని గుర్తు చేసిన సీఎం, అప్పటితో పోలిస్తే నేడు నేరాల తీరు, నేరస్థుల పద్ధతులు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం, విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు పెరిగాయని, వాటిని ఎదుర్కొనే సామర్థ్యం పోలీసు వ్యవస్థకు తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు.

**శిక్షలు పడతాయనే భయం నేరస్థుల్లో పెరగాలి**

నేరాలను అరికట్టడమే కాదు... నేరం చేసిన వారికి వేగంగా శిక్షలు పడేలా దర్యాప్తు వ్యవస్థ పనిచేస్తేనే నేరస్థుల్లో భయం ఏర్పడుతుందని సీఎం స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ముందస్తు ప్రణాళికలు, సమర్థవంతమైన దర్యాప్తు, వేగవంతమైన ఫలితాలే పోలీసింగ్‌కు అసలైన ప్రమాణాలన్నారు. మారుతున్న అవసరాలకు మిగతా .. 2లో..

ఎర్రచందనం మాఫియా మూలాలను

## పూర్తిగా తుడిచేయాలి

- డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత వినియోగించుకొంటూ నిఘా పటిష్టం చేయాలి
- స్మగ్లింగ్ అరికట్టడంలో జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలి
- స్మగ్లర్లతోపాటు కింగ్ పిన్‌లపైనా ఉక్కుపాదం మోపండి
- మన ఎర్ర చందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలవద్దు
- ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ సమీక్ష



మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ : 'రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా తుడిచి పెట్టే లక్ష్యంతో అటవీ శాఖ ప్రణాళికలకు మరింత పదును పెట్టాలి. ఇందుకోసం స్మగ్లింగ్ ముఠాలపై నిఘా పెంచాలి. డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత వినియోగించుకొంటూ నిఘా పటిష్టం చేయాల'ని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. స్మగ్లింగ్ ముఠాల నెట్ వర్క్‌ను మూలాలతో సహా నిర్మూలించేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు ఎలాంటి అవకాశం లేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎర్రచందనం మిగతా .. 2లో..

## "కాకాణితో వెళ్ళి జగన్‌ని కలిసిన గురవయ్య"



తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన బూదూరు గురవయ్య, నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డితో కలిసి తాడేపల్లిలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర మిగతా .. 2లో..

ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది

## వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి

రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి
సాగు నీటి ఎద్దడిని తట్టుకోవడానికి ప్రత్యామ్నాయ పంటలు వేయాలి
గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో తాగు, సాగు నీటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు
నదులు అనుసంధానంతో అద్భుత ఫలితాలు సాధించగలం
రాష్ట్ర సమాచార,పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ఎల్ నినో ప్రభావం ఈ ఏడాది అధికంగా ఉంటుంది కావున రైతుల శ్రేయస్సు దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో మంత్రులు, అధికారులు సమన్వయంతో సమస్య నుండి రైతులు గట్టెక్కే విధానాలపై కసరత్తు చేస్తున్నామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మిగతా .. 2లో..

సీఎం రేవంత్‌రెడ్డికి

## కేటీఆర్ లీగల్ నోటీసులు




హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. గ్లోబరీనా టెక్నాలజీస్ అంశంలో చేసిన మిగతా .. 2లో..

ప్రతి తెలుగు హృదయాన్ని కలిపే సాంస్కృతిక ఉత్సవం

## "తెలుగు మహోత్సవం"

జులై 25, 26 తేదీల్లో ఉండవల్లి గుహల వద్ద ఘనంగా వేడుకలు
మంత్రి కందుల దుర్గేష్ పిలుపు



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : మాతృభాష వైభవాన్ని, సాంస్కృతిక సంపదను భావితరాలకు అందించాలనే ఉన్నతాశయంతో రాష్ట్రస్థాయిలో తెలుగు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం అనంతరం రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జులై 25, 26 తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చారిత్రాత్మక ఉండవల్లి గుహల ప్రాంగణంలో జరగనున్న తెలుగు మహోత్సవం మిగతా .. 2లో..

## 'నేతన్న సేవ'తో ఆర్థిక దన్ను

చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం
51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి - రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్రంలో చేనేత కళాకారులు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఇందులో భాగంగా నేతన్నలకు ఆర్థిక దన్ను కలిగేలా నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. నేతన్న సేవలో పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి కలిగేలా ఏటా రూ.25 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయించామని, వచ్చే నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం మిగతా .. 2లో..

జొన్నగిరి గోల్డ్ మైన్ ఇకపై


## 'స్వర్ణగిరి గోల్డ్ మైన్'

దేశంలో స్వాతంత్ర్యం తర్వాత ఏర్పాటైన తొలి ప్రైవేట్ బంగారు గనికి కొత్త గుర్తింపు
కర్నూలు జిల్లా బంగారు గనికి అధికారికంగా పేరు మార్చిన రాష్ట్ర ప్రభుత్వం


అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : కర్నూలు జిల్లాలోని జొన్నగిరి గోల్డ్ మైన్ పేరును రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'స్వర్ణగిరి గోల్డ్ మైన్'గా మార్చింది. దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రైవేట్ రంగంలో ఏర్పాటైన తొలి బంగారు గనిగా గుర్తింపు పొందిన ఈ గని భవిష్యత్తులో దేశంలోనే ప్రముఖ బంగారం ఉత్పత్తి కేంద్రంగా ఎదిగే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పరిధిలోని మిగతా .. 2లో..

## ఈ తరానికి ఓపిక తక్కువ..

'హనీమూన్ హత్య' కేసులో సుప్రీం వ్యాఖ్యలు



విశ్వం వాయిస్ న్యూస్ : సమాజంలో వస్తోన్న మార్పుల కారణంగానే ఈ మధ్య కాలంలో 'హనీమూన్ హత్య' లాంటి కేసులు వెలుగుచూస్తున్నాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ తరం వాళ్లకు జ్ఞానం పెరుగుతున్నప్పటికీ.. ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో తెలియట్లేదని పేర్కొంది. అందుకే వారు మరింత బలహీనంగా మారుతున్నారని తెలిపింది. సోనమ్ రఘువంశీ బెయిల్ అంశంపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. భర్త రాజా రఘువంశీని హత్య చేసిన మిగతా .. 2లో..




భారత్‌ను వేలెత్తి చూపే ముందు..

## ఇంట గెలవండి : పాక్‌కు చురకలు



విశ్వం వాయిస్ న్యూస్ : ఐక్య రాజ్యసమితి వేదికగా పాకిస్థాన్‌కు భారత్ మరోసారి గట్టి కౌంటర్ ఇచ్చింది. ఉగ్రవాదాన్నే విదేశాంగ విధానంగా ఉపయోగిస్తున్న పాక్.. అసత్య ప్రచారంతో అంతర్జాతీయ వేదికను దుర్వినియోగం చేస్తోందని మండిపడింది. జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేసింది. సింధూ జలాల ఒప్పందంపై తమ విధానంలో ఎలాంటి మార్పు లేదని భారత్ తేల్చిచెప్పింది. ఐరాస భద్రతా మండలిలో జరిగిన మిగతా .. 2లో..

చమురు నౌకలపై

## హూతీల దాడి..

ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్



విశ్వం వాయిస్ న్యూస్ : అమెరికా- ఇరాన్ యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతోంది. చమురు ధరలు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో హూతీల రూపంలో మరో సమస్య వచ్చిపడింది. ఇరాన్‌కు మద్దతుగా నిలుస్తున్న హూతీలు.. ఎర్ర సముద్రంలో మిగతా .. 2లో..

## అమెరికాపై 9/11 తరహా దాడులు

ఇరాన్ తీవ్ర హెచ్చరికలు



విశ్వం వాయిస్ న్యూస్ : పశ్చిమాసియాలో పరిస్థితులు మరింతగా దిగజారుతున్నాయి. అమెరికా–ఇరాన్ పరస్పర దాడులు, ప్రకటనలతో ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. హర్మూజ్ జలసంధిలో ఇరాన్ ఇక నుంచి ఏదైనా నౌకపై దాడి చేసినప్పుడల్లా ఆ దేశంలోని ఓ వంతెన లేదా విద్యుత్ కేంద్రంపై బాంబులేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# 'ఏపీ అస్త్రం' ఆవిష్కరణ

అనుగుణంగా పోలీసు వ్యవస్థను రీ-స్ట్రక్చర్ చేయాలని, ఇన్విజిబుల్ పోలీస్... విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తే పరిమిత సిబ్బందితోనూ క్లిష్టమైన ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించవచ్చని చెప్పారు. ఇందుకు ఆపరేషన్ సింధూర్ నిదర్శనమని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా, అందుబాటులో ఉండాలని... అదే సమయంలో నేరస్థుల విషయంలో రాజీపడకుండా కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. తిరుమల మెట్ల మార్గంలో అపహరణకు గురైన ఆంజనేయస్వామి విగ్రహాన్ని అత్యంత వేగంగా టెక్నాలజీ సాయంతో గుర్తించి స్వాధీనం చేసుకున్న ఘటనను ఉదాహరణగా ప్రస్తావించారు. ఇలాంటి ఘటనల్లో వెంటనే స్పందించకపోతే ప్రజల్లో అపోహలు వ్యాపిస్తాయని, ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అపహరించిన ఆంజనేయ స్వామి విగ్రహాన్ని త్వరితగతిన గుర్తించడానికి కారణం టెక్నాలజీనేననే విషయాన్ని గుర్తించాలన్నారు.

**దుష్ప్రచారాన్ని వేగంగా తిప్పికొట్టాలి**

ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేసేందుకు కొందరు రాజకీయంగా నేరాలను కూడా ఉపయోగించుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయని సీఎం వ్యాఖ్యానించారు. పాస్టర్ ప్రవీణ్ మరణం ఘటనలో కొన్ని పార్టీలు చేసిన దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నాలుగైదు రోజులు పట్టిందని గుర్తుచేస్తూ, ఇలాంటి వాటి విషయాల్లో త్వరితగతిన స్పందించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే సోషల్ మీడియా ద్వారా జరిగే తప్పుడు ప్రచారాన్ని వెంటనే ఖండించే సమర్థ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో గంజాయి నియంత్రణలో పురోగతి సాధించినా... ఇంకా పూర్తిస్థాయిలో కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి, డ్రగ్స్ కారణంగా కుటుంబాలు నాశనమవుతున్నాయని, మత్తు పదార్థాల ప్రభావంతో జరిగే నేరాలను పూర్తిగా అరికట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

**మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పు అవసరం**

పోలీసు వర్క్‌ఫోర్స్‌కు రీ-ఓరియెంటేషన్ అవసరమని, ప్రతి పోలీసు సిబ్బందికి డిజిటల్ లిటరసీ తప్పనిసరిగా ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. పోలీసింగ్‌లో ఏఐ వినియోగాన్ని పెంచాలని సూచించారు. అలాగే వివిధ అంశాలకు సంబంధించి సమర్థవంతమైన పోలీసింగ్ కోసం శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ మేరకు అవసరమైన సర్టిఫికేషన్ కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా, సైబర్ నేరాలు, గంజాయి-డ్రగ్స్, మహిళలపై నేరాల నియంత్రణ, కన్విక్షన్ వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏపీఎస్పీలో శిక్షణ పొందుతున్న సిబ్బందిని అవసరమైతే డెప్యూటేషన్‌పై జిల్లాలకు పంపే అంశాన్ని పరిశీలించాలని, పోలీసు ఉన్నతాధికారులు కూడా వివిధ రంగాల నిపుణులు, ప్రొఫెసర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని సీఎం సూచించారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల అనుభవాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నేరాలను అరికట్టడమే కాకుండా నేరాలకు అలవాటు పడిన వారిని సంస్కరించడం.. వారిని కంట్రోల్లో పెట్టడం వంటి చర్యలు కూడా చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**ఫోరెన్సిక్‌కు మరింత బలం**

డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ విభాగాలను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. శాంతి భద్రతలను అదుపు చేయడం... నేరాలను కట్టడి చేయడంలో ప్రణాళికలు రచించడంతో పాటు ఫలితాలు చూపగలగాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే రౌడీయిజాన్ని, ఫ్యాక్షనిజాన్ని కంట్రోల్ చేశామంటూ నాడు జరిగిన కొన్ని సంఘటనలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఏపీ పోలీస్ వెబ్ సైట్, ధర్మ యాప్, విజయవాడ పోలీసులు రూపొందించిన ఏపీ అస్త్రం మొబైల్ యాప్ ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అలాగే రోడ్ సేఫ్టీ, పుష్కరాల్లో సాంకేతిక వినియోగం ద్వారా క్రౌడ్ మేనేజ్మెంట్ వంటి 8 అంశాలపై సీఎం చంద్రబాబు సమక్షంలో ఏపీ పోలీసులు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, విట్ యూనివర్శిటీతో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సదస్సులో హోం మంత్రి అనిత, హోం సెక్రటరీ కుమార్ విశ్వజిత్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా పోలీస్ ఉన్నతాధికారులు, జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి అప్పలరాజుకు 14 రోజుల రిమాండ్

కుట్ర పన్నినట్లు పోలీసులు నిర్ధరించారు. ఈ కేసులో ఆయన్ను ఏ3గా చేర్చారు. బుధవారం సాయంత్రం కాశీబుగ్గలో జీఎంఈ కాలనీలోని నివాసంలో అప్పలరాజును అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. గురువారం ఆయనకు పలాస సీహెచ్‌సీలో వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం కోర్టుకు తీసుకెళ్లారు.

# విద్యార్థుల డిమాండ్లకు సంపూర్ణ మద్దతు

కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నివాళులు అర్పించారు. అంతకుముందు.. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాహుల్, ప్రియాంక సహా విపక్ష నేతలు బస్సుల్లో బయలుదేరగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రాహుల్ నివాసం వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులు ఒంటరి వారు కాదని, వాళ్లకు అండగా ఉంటామని ప్రకటించారు.

**జంతర్ మంతర్ వద్ద ఇంటర్నెట్ నిలిపివేత**

దిల్లీలో సీజేపీ కార్యకర్తలు, విద్యార్థులు ఆందోళన చేస్తున్న జంతర్‌మంతర్ వద్ద ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ అర్ధరాత్రి వరకు అక్కడ ఒకటిన్నర కి.మీ పరిధిలో ఇంటర్నెట్ సేవలు నిలివేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. జులై 17 నుంచి ఇప్పటివరకు ఇలా ఐదు సార్లు ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

# ఎర్రచందనం మాఫియా మూలాలను పూర్తిగా తుడిచేయాలి

అక్రమ రవాణా నిరోధం, రెండేళ్లలో ఏ మేరకు స్మగ్లింగ్ నిరోధించారు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై అటవీశాఖ ఉన్నతాధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్షించారు. ఈ సందర్భంగా గడచిన రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అటవీ శాఖ తీసుకున్న చర్యలు, సాధించిన ప్రగతి, నమోదైన కేసుల వివరాలను అధికారులు వివరించారు.

**506 కేసులు... 1239మంది అరెస్టు**

గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టినట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి వివరించారు. 506 కేసులు నమోదు చేసి, 1,239 మందిని అరెస్ట్ చేయగా, 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఎర్రచందనాన్ని గుర్తించి, ఆయా రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి అంతర్రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించలేదని పేర్కొన్నారు. అలాగే, ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో గతంలో కన్విక్షన్ రేటు 3 శాతం కంటే తక్కువగా ఉండేదని, 95 శాతం కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలు విధించే స్థాయికి కన్విక్షన్ రేటు పెరిగిందని వివరించారు. గతంలో స్మగ్లర్లపై పీడీ చట్టం అమలు చేయని పరిస్థితి ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 12 మంది స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**సమన్వయం తక్షణ అవసరం**

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే ప్రత్యేకించిన అటవీ సంపద... ఎర్ర చందనం. కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఎర్ర చందనం స్మగ్లింగ్‌పై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వం అవలంబిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టంగా అమలు చేయాలి. దేశంలో ఎక్కడ ఎర్రచందనం అక్రమ నిల్వలు ఉన్నా ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని స్వాధీనం చేసుకోవాలి. ఇతర రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖ అధికారులతో సమన్వయం తక్షణ అవసరం. స్మగ్లింగ్ ముఠాల వెనుక ఉన్న కింగ్ పిన్స్, ఫైనాన్షియర్స్ పైనా దృష్టి సారించాలి. బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రానికి చెందిన విలువైన ఎర్రచందనం సంపదను రక్షించేందుకు అత్యాధునిక సాంకేతికత, డ్రోన్ల పరిజ్ఞానాన్ని వినియోగించుకొంటూ నిఘాను మరింత విస్తృతంగా వినియోగించాలి. అంతర్రాష్ట్ర సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలన్నారు.

# "కాకాణితో వెళ్లి జగన్‌ని కలిసిన గురవయ్య"

కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. తనను నమ్మి, కీలక బాధ్యతలు అప్పగించినందుకు వైఎస్ జగన్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన గురవయ్య.. గూడూరులో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి

తెలిపారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన 1390 వ (53వ) క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి వెల్లడించారు.క్యాబినేట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు సమస్యలపై దిశానిర్దేశం చేశారని ముఖ్యంగా ఎల్ నినో ప్రభావంతో రైతులు సాంప్రదాయ పంటలు వేయటం వల్ల సకాలంలో సాగు నీరు అందక పోతే నష్టపోతారన్న అభిప్రాయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యక్తం చేశారని తెలిపారు.ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఆగస్టు తరువాత మరింత తీవ్రంగా ఉండనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు.ఈ ఏడాది సాధారణం కంటే 51 శాతం కంటే ఎక్కువగా వర్షపాతం తగ్గుదల ఉంటుందని,దీంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున రైతులు ఈ ఏడాది నీటి ఎద్దడిని ఎదుర్కొనే ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గుచూపాలని తద్వారా ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం నుండి తప్పించుకోవచ్చని సూచించారు.అంతేకాకుండా భూగర్భ జలాలు సైతం అడుగంటే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు.బోర్లు వేసి వ్యవసాయం చేద్దాం అనే ఆలోచన ను రైతులు చేయవద్దని కోరారు.దీంతో భూగర్భ జలాలు మరింత అటుగంటే ప్రమాదం పొంచి ఉందని మంత్రి పార్థసారథి అన్నారు. పోలవరం వద్ద గోదావరి నది ప్రతి ఏడాది ఈ సమయానికి దాదాపు లక్ష క్యూసెక్కుల వరద నీరు ప్రవహించేదని కాని ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడటంతో ఈ ఏడాది కేవలం 35 నుండి 38వేల క్యూసెక్కుల వరద నీరు మాత్రమే ప్రవహిస్తోందని దీంతో గోదావరి,కృష్ణా పరివాహక ప్రాంతాల్లో సాగు నీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు.ఒక వేళ మంచి వర్షాలు పడితే మంచిదే కాని ఎల్ నినో ప్రభావం పై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.గోదావరి, కృష్ణా జలాలతో సాగు చేసే రైతులు ఇప్పటికే 70 శాతం మంది రైతులు నాట్లు వేశారని, కాని ఇప్పటి వరకు నాట్లు వేయని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు.రైతులకు ప్రభుత్వం,వ్యవసాయ శాఖలు అండగా ఉంటాయని,రైతులు కూడా ప్రభుత్వం అందించే సూచనలు,సలహాలు పాటించాలని కోరారు. రైతులను ఆదుకోవడానికి వివిధ రకాల విత్తనాల కిట్లను అందించడానికి వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోందన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని,ఎల్ నినో ప్రభావం నుండి బయట పడాలని రైతులకు సూచించారు.తాగునీటి సరఫరాకు ట్యాంకర్ల వినియోగంపై కూడా ప్రభుత్వం సమాలోచన చేస్తుందన్నారు. అలాగే పశుగ్రాసం కొరత రాకుండా మెట్ట పంటల సాగు ఆలోచన చేయలని కోరారు. మన రాష్ట్రంలో 59 శాతం ఆయకట్టు భూమి,41 శాతం వర్షాధార పంట భూములు ఉన్నాయని,ఈ ఏడాది ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. అందుకు అవసరమైన విత్తనాల కిట్లను కూడా వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తుందన్నారు. నదుల అనుసంధానంతో అద్భుత ఫలితాలు సాధించవచ్చు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో సారి ఉద్ఘాటించారని మంత్రి పార్థసారథి తెలిపారు.ఎల్ నినో ప్రభావాలను తగ్గించడానికి జల వనరులను రెగ్యులైజ్ చేయాలన్న ఆలోచన ముఖ్యమంత్రి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి తన ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రతిపాదించడం జరిగిందన్నారు.గోదావరి నది, కావేరి నదులు వయా బనకచర్ల అనుసంధానం వల్ల మూడు రాష్ట్రాలకు అధిక ప్రయోజనం కలుగుతుందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయం ఎంతో ఉపయుక్తమైనదన్నారు. కర్ణాటక,తమిళనాడు రిజీయన్ లో ఘర్షణ వాతావరణం సైతం తగ్గటమే కాకుండా తమిళనాడు తాగు నీటి సమస్యలకు చెక్ పెట్టవచ్చన్నారు.గోదావరి, కావేరి నదుల అనుసంధానంపై కేంద్రం సానుకూలంగా ఉండటం హర్షనీయమన్నారు. నదుల అనుసంధానం తెలంగాణా,ఏపి,తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉంటుందని, అంతే కాకుండా ఈ నాలుగు రాష్ట్రాల్లోని రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన చేస్తున్నారన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్ గా నిలవనుందని, ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమానా శ్రయాన్ని ప్రారంభించ నున్నారని మంత్రి పార్థసారథి తెలిపారు.అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కెఎస్.విశ్వనాధన్ పాల్గొన్నారు.

# కేటీఆర్ లీగల్ నోటీసులు

ఆరోపణలపై 48 గంటల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "ఎలాంటి ఆధారాలు లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేశారు. గ్లోబరీనా సంస్థతో నాకు ఎలాంటి ఆర్థిక సంబంధాలు, యాజమాన్య హక్కులు లేవు. గ్లోబరీనా నా బినామీ కంపెనీ అనడం.. సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించాననడం పూర్తిగా అవాస్తవం. అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉంటూ నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు. రాజకీయ లబ్ధికోసమే నా ప్రతిష్ఠను దెబ్బతీసేలా దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేశారు. గడువులోపు క్షమాపణ చెప్పకపోతే సివిల్, క్రిమినల్ చర్యలతో పాటు పరువు నష్టం దావా వేస్తాం" అని కేటీఆర్ అన్నారు.

# "తెలుగు మహోత్సవం"

అధికారిక పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు భాషా వైభవం, సాహిత్య సంపద, సాంస్కృతిక సౌందర్యం, కళా సంప్రదాయాలు, జానపద వారసత్వం మరియు సృజనాత్మకతలను ఒకే వేదికపైకి తెచ్చే అద్భుతమైన వేడుక ఈ తెలుగు మహోత్సవం అన్నారు.మాతృభాషలోని మాధుర్యాన్ని విద్యార్థులు, యువతీ యువకులు ఆస్వాదించేలా, నిత్య జీవితంలో వాడుకలోకి తెచ్చేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు.ఆధునిక పోకడల్లో తెలుగు భాషా స్వరూపం తగ్గుతోందనే ఆందోళనను అధిగమించి మాతృభాష గొప్పతనాన్ని విశ్వవిఖ్యాతం చేసేందుకు ఈ ఉత్సవం దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమ వివరాలు వెల్లడిస్తున్న సమయంలో మంత్రి దుర్గేష్ సాహితీ సమరాంగ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన దేశభాషలందు తెలుగు లెస్స అన్న భావంతో కూడిన తెలుగ దేలయన్న దేశంబు తెలుగేను పద్యాన్ని స్వయంగా ఆలపించి, దాని తాత్పర్యాన్ని వివరించారు.మాతృభాష గొప్పతనాన్ని చాటిచెప్పే ఈ మహా కార్యంలో విద్యార్థులు, యువత, తెలుగు భాషాభిమానులు, ప్రతి ఒక్కరూ విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

# 'నేతన్న సేవ'తో ఆర్థిక దన్ను

సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించ నున్నామన్నారు.రాష్ట్రం చేనేత రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని ఈ నెల 26న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా కూటమి ప్రభుత్వం మరో శుభవార్త చెప్పిందన్నారు.నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఈ మేరకు కేబినెట్ లో ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఆగస్టు ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం నాడు నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.ఈ పథకం ద్వారా ఏటా 51,952 మంది నేతన్నలకు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేయ నున్నామన్నారు.చేనేతలకు ఆర్థిక దన్ను కలిగించేలా నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

**నేతన్న కుటుంబానికి భారీ ఆర్థిక లబ్ధి.**

50 ఏళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.51,952 మంది నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామన్నారు.మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు.మగ్గం నేతన్నలకు నెలకు రూ. 720లు, ఏడాదికి రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు నెలకు రూ.1800 చొప్పున ఏడాదికి రూ. 21,600లు లబ్ధి కలుగుతోందన్నారు.మగ్గం నేతన్నలకు నేతన్న సేవలో రూ.25 వేలు,పెన్షన్ రూ.48 వేల చొప్పున రూ.48 వేలు, ఉచిత్ విద్యుత్ తో రూ.8,640లు మొత్తం ఏడాదికి రూ. 81,640లు ప్రత్యక్ష ఆర్థిక లబ్ధి కలుగుతుందన్నారు.మర మగ్గం నేతన్నలకు నేతన్న సేవలో పథకం కింద రూ.25 వేలు,పెన్షన్ రూపంలో రూ.48 వేలు, ఉచిత విద్యుత్ కింద రూ.21,600లు కలిపి మొత్తం రూ.94,000 లబ్ధి కలుగుతోందన్నారు.

**చంద్రబాబు పాలన నేతన్నలకు స్వర్ణయుగమే..**

కూటమి ప్రభుత్వం రాగానే నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చామని మంత్రి సవిత గుర్తు చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా టెక్స్ టైల్స్ పార్కులు,క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేతన్నలకు గౌరవప్రద జీవనమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు.ఏటా థ్రిఫ్ట్ ఫండ్ కింద రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నామని,నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నామని తెలిపారు. చేనేతలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమని,ఆప్కో చరిత్రలో మొట్టమొదటిసారిగా టీటీడీతో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు.చంద్రబాబు పాలన నేతన్నలకు ఎప్పుడూ స్వర్ణయుగమేనని మంత్రి సవిత కొనియాడారు.

**26న రాష్ట్ర పండుగగా ప్రగడ కోటయ్య జయంతి**

ఈ నెల 26న చేనేత సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించ నున్నామని మంత్రి సవిత తెలిపారు.చీరాలలో ప్రగడ కోటయ్య రాష్ట్ర స్థాయి జయంతిని జరపనున్నట్లు వెల్లడించారు.

**మాజీ సియం జగన్‌కు నిరూపణ చేతకాదు**

జగన్ కు ఆరోపణలు చేయడమే తప్ప నిరూపించడం చేతకాదని, కూటమి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయడమే ఆయన లక్ష్యమని మంత్రి సవిత విమర్శించారు.ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీని జగన్ నెరవేర్చలేదన్నారు.ఏటా జాబ్ క్యాలెండర్,సీపీఎస్ రద్దు, డీఎస్సీ నిర్వహణ,సంపూర్ణ మద్యపాన నిషేధం,ఇద్దరు బిడ్డలకు అమ్మఒడి అని హామీలిచ్చి ఏ హామీని కూడా ఆయన నెరవేర్చలేదన్నారు. కూటమి ప్రభుత్వంపై జగన్ కు మాట్లాడే నైతిక హక్కే లేదన్నారు.అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు తన మొదటి సంతకం మెగా డీఎస్సీ నిర్వహణ ఫైల్ సంతకం చేసి, తనమాట నిలబెట్టుకు న్నారన్నారు.గతంలోనూ సీఎం చంద్రబాబు ఎంతో పారదర్శకతతో డీఎస్సీలు నిర్వహించారని గుర్తుచేశారు. గతేడాది మెగా డీఎస్సీని కూడా అవకతవకలకు తావులేకుండా పూర్తి చేశారని మంత్రి సవిత కొనియాడారు.

# 'స్వర్ణగిరి గోల్డ్ మైన్'

పగిడిరాయి, జొన్నగిరి, ఎర్రగుడి గ్రామాల సరిహద్దుల్లో ఈ బంగారు గని విస్తరించి ఉంది. మొత్తం 597.820 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఈ గనిలో ప్రధానంగా బంగారాన్ని వెలికితీస్తున్నారు. దీంతో పాటు వెండి, రాగి, సీసం, జింక్ వంటి ఇతర ఖనిజాలను కూడా తవ్వుతున్నారు. బంగారం వెలికితీత కోసం జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రభుత్వం 30 సంవత్సరాల మైనింగ్ లీజును మంజూరు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఏడాది జూన్‌లో గనిని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ ప్లాంట్‌లో వాణిజ్య బంగారం ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించారు. స్వాతంత్ర్యం తర్వాత దేశంలో ప్రైవేట్ రంగంలో ఏర్పాటైన తొలి బంగారు గని కావడంతో దీనికి ఉన్న జాతీయ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని 'స్వర్ణగిరి' అనే పేరు పెట్టారు. 'స్వర్ణం' అంటే బంగారం, 'గిరి' అంటే కొండ అని అర్థం. ఈ ప్రాంతంలో బంగారం లభించే కొండలు ఉండటంతో ఈ పేరు పెట్టారు. అంతేకాకుండా పురాతన కాలం నుంచే ఈ ప్రాంతంలో బంగారం వెలికితీసిన చారిత్రక నేపథ్యం కూడా ఈ పేరుకు ప్రత్యేకతను ఇస్తోంది. జొన్నగిరి ప్రాంతానికి సుదీర్ఘమైన ఖనిజ చరిత్ర ఉంది. ఇది ఈస్టర్న్ ధార్వార్ క్రేటన్‌లోని జొన్నగిరి గ్రీన్‌స్టోన్ బెల్ట్‌లో భాగంగా ఉంది. ఈ ప్రాంతంలో పురాతన కాలం నాటి శిథిలాలు, రాళ్లను పగలగొట్టిన గుర్తులు, పాత తవ్వకాల ఆనవాళ్లు కనిపిస్తాయి. శతాబ్దాల క్రితమే ఇక్కడ బంగారం వెలికితీసినట్లు ఈ ఆనవాళ్లు సూచిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని ఖనిజ వనరులు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా దృష్టిని కూడా ఆకర్షించాయి. స్వర్ణగిరి గోల్డ్ మైన్‌లో ఓపెన్ పిట్ మైనింగ్ విధానాన్ని ఉపయోగిస్తున్నారు. మూడు దశల క్రషింగ్, బాల్ మిల్ గ్రైండింగ్, నెల్సన్ కాన్సంట్రేటర్ గ్రావిటీ సర్క్యూట్ వంటి ఆధునిక సాంకేతిక విధానాలను వినియోగిస్తున్నారు. అలాగే సీఐఎల్ లీచింగ్, ఎల్యూషన్, ఎలక్ట్రో విన్నింగ్, డోరే స్మెల్టింగ్ వంటి ఆధునిక ప్రక్రియలతో కూడిన ప్రాసెసింగ్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశారు. జొన్నగిరి గోల్డ్ మైన్ పేరును అధికారికంగా మార్చాలని రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి మేరకు ముఖేష్ కుమార్ మీనా ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇకపై మైనింగ్ ప్లాన్‌లు, చట్టపరమైన అనుమతులు, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ , పర్యావరణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ తదితర అధికారిక రికార్డుల్లో కూడా 'స్వర్ణగిరి గోల్డ్ మైన్' పేరును నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# ఈ తరానికి ఓపిక తక్కువ..

కేసులో నిందితురాలిగా ఉన్న సోనమ్‌కు సుప్రీంకోర్టు గురువారం బెయిల్ రద్దు చేసింది. ఆమె మూడు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. ఈ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలె ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "మారుతున్న సమాజంలో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. నేటి తరానికి ఓపిక తక్కువ, చికాకు ఎక్కువ. వారు సమస్యలకు తక్షణ పరిష్కారాలను కోరుకుంటున్నారు. సోషల్ మీడియాలో ఎక్కువ సమాచారం అందుబాటులో ఉంటోంది. అందులో షేర్ అవుతున్న వాటిని నమ్మి దాన్నే జ్ఞానం అనుకుంటున్నారు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మేఘాలయ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. "ఈ మధ్య హనీమూన్‌కు వెళ్తోన్న భర్తలు బాడీగార్డులను వెంట తీసుకెళ్తున్న కామెడీ రీల్స్ వస్తున్నాయి. భార్యాభర్తల బంధంలో ఒకరిపై ఒకరికి ఉండే నమ్మకం క్రమంగా క్షీణిస్తోంది. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఇలాంటి సమస్యను మెరుగ్గా పరిష్కరించేవి" అని పేర్కొన్నారు. మెహతా వ్యాఖ్యలతో ఏకీభవించిన ధర్మాసనం.. "ఉమ్మడి కుటుంబంలో పెరిగినప్పుడు పెద్దవాళ్లను చూసి పిల్లలు సర్దుకుపోయే మనస్తత్వాన్ని నేర్చుకోగలుగుతారు. నిరాశను ఎలా జయించాలో తెలిసొస్తుంది. కానీ, నేడు అన్నీ చిన్న కుటుంబాలే. అలాంటి వాతావరణంలో పెరిగిన వారు చిన్న చిన్న వాటికే ఏడుస్తున్నారు. నచ్చినది దొరక్కపోతే విపరీతమైన ఆందోళనకు గురవుతున్నారు. ఈ మధ్య ఓ హోటల్‌లో చిన్నారి ఏడుస్తుంటే.. తల్లిదండ్రులు మొబైల్ ఇచ్చి ఊరుకోబెట్టారు. ఇదే ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. భావోద్వేగాలను నియంత్రించాల్సిన సమయంలో గ్యాడ్జెట్లతో సర్దిచెప్తున్నారు" అని విచారం వ్యక్తం చేసింది.

# ఇంట గెలవండి : పాక్‌కు చురకలు

ఉన్నతస్థాయి చర్చ సందర్భంగా పాక్ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తింది. దీంతో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్.. పాక్‌కు దీటుగా బదులిచ్చారు. ఈ చర్చలో ఇతర అంశాలను ప్రస్తావించడం తమ ఉద్దేశం కాదని, కానీ పాక్ తప్పుడు ప్రచారం చేసేందుకు ఈ వేదికను దుర్వినియోగం చేస్తుందంటూ మండిపడ్డారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమనేది చట్టపరమైన వాస్తవమని గుర్తుచేశారు. కశ్మీర్‌కు సంబంధించి మిగిలి ఉన్న ఏకైక సమస్య పీవోకే మాత్రమేనని స్పష్టం చేశారు. సింధూ జలాల ఒప్పందంపై తమ విధానంలో ఎలాంటి మార్పు లేదని భారత ప్రతినిధి పునరుద్ఘాటించారు. పరస్పర విశ్వాసం, సత్సంకల్పంతోనే ఇరు దేశాల మధ్య సహకారం సాధ్యమవుతుందని తెలిపారు. అయితే, సీమాంతర ఉగ్రదాడులకు పాల్పడుతోన్న పాక్.. ఇలాంటి ఒప్పందాల నుంచి ప్రయోజనాలను కోరుకోవడం సరికాదని దుయ్యబట్టారు. అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను వేలెత్తి చూపుతూ నిరాధార ఆరోపణలు చేయడం మానుకొని.. పాక్ ముందుగా తమ దేశంలోని సమస్యలను పరిష్కరించుకోవాలని హరీశ్ హితవు పలికారు.

# హూతీల దాడి..

ప్రయాణిస్తున్న సౌదీ అరేబియాకు చెందిన రెండు చమురు నౌకలపై దాడి చేశారు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. హూతీలు దాడులకు పాల్పడినా.. టెహ్రాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. సైనిక చర్య చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. "వాణిజ్య నౌకలపై దాడి చేసినందుకు గానూ ఏడాది క్రితం హూతీలకు అమెరికా గట్టిగా బుద్ధి చెప్పింది. అప్పటి నుంచి వారు నియంత్రణలోనే ఉన్నారు. దురదృష్టవశాత్తు ఇప్పుడు మళ్లీ దాడులు మొదలుపెట్టారు. నిన్న రాత్రి రెండు సౌదీ అరేబియా నౌకలపై కాల్పులు జరిపారు. మరోసారి ఇదే తరహా ఘటనలు పునరావృతమైతే.. అందుకు ఇరాన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఎందుకంటే హూతీలు ఇరాన్ ప్రతినిధులే" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నెల 12న అమెరికా బలగాలు ఇరాన్‌పై దాడికి ప్రతీకారంగా చమురు నౌకలను దెబ్బతీసినట్లు హూతీలు ప్రకటించిన సంగతి తెలిసిందే.

**ఇరాన్‌కు అడ్డుకట్ట వేసేందుకే దాడులు: అమెరికా**

మరోవైపు, వాణిజ్య నౌకలు, నావికులను బెదిరించేందుకు ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోందని, దానికి అడ్డుకట్ట వేసేందుకే అమెరికా దాడులు చేస్తోందని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. హర్మూజ్ జలసంధిపై మళ్లీ పట్టు సాధించేందుకు, నౌకల రాకపోకలు సజావుగా సాగేలా చూసేందుకు అమెరికా దళాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని తెలిపింది. హర్మూజ్‌పై పట్టు సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేసింది.

# అమెరికాపై 9/11 తరహా దాడులు

సంగతి తెలిసిందే. దీంతో ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. అమెరికాపై 9/11 తరహా దాడి చేస్తామని బెదిరించింది. ఘర్షణలు ఇలాగే కొనసాగితే ఆ దేశం జాతీయ సంతాప దినాలు చేసుకోవాల్సి వస్తుందంటూ హెచ్చరికలు చేసినట్లుగా ఇరాన్ ప్రభుత్వ అనుబంధ మీడియా సంస్థ తస్నిమ్ పేర్కొంది. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రవాదుల దాడి అమెరికా చరిత్రలో అత్యంత విషాదకర ఘటనగా మిగిలిపోయింది. సెప్టెంబరు 11, 2001న నాలుగు విమానాలను అల్‌ఖైదా ఉగ్రవాదులు హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. 19 మంది ఉగ్రవాదులు నాలుగు జట్లుగా విడిపోయి 'ట్విన్ టవర్స్'గా పిలుచుకునే ప్రపంచ వాణిజ్య సంస్థ భవంతులపై దాడులకు పాల్పడ్డారు. ఈ మారణహోమంలో మొత్తం 2,996 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 25 వేల మంది పౌరులు క్షతగాత్రులయ్యారు. అప్పుడు అమెరికా జాతీయ సంతాప దినాలు ప్రకటించింది. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూనే ఇరాన్ ఈ తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

**మేం చమురు అమ్మకపోతే.. ఇంకెవరూ అమ్ముకోలేరు: ఇరాన్**

అమెరికా బలగాలు హర్మూజ్‌కు దూరంగా ఉంటేనే ఆ జలసంధి భద్రంగా ఉంటుందని ఇరాన్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. తాము చమురు విక్రయించకపోతే.. ఇంకెవరూ అమ్మలేరని పేర్కొన్నారు. హర్మూజ్‌లో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేయడంతో పశ్చిమాసియాలో మరోసారి మొదలైన ఘర్షణలు.. దాదాపు 12 రోజులుగా కొనసాగుతున్నాయి. టెహ్రాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీసేలా దాడులు చేశామని యూఎస్ సెంట్రల్ కమాండ్ తాజాగా ప్రకటించింది.

**సౌదీ చమురు ట్యాంకర్లపై దాడి చేశాం: హూతీలు**

ఎర్ర సముద్రానికి గేట్‌వే వంటి బాబ్ ఎల్-మాండెబ్ జలసంధిని మూసివేస్తున్నట్లు యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. సౌదీ అరేబియా నౌకల రాకపోకలను అడ్డుకుంటామని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే సౌదీకి చెందిన రెండు చమురు ట్యాంకర్లపై దాడులు చేసినట్లు ప్రకటించారు.

# ఎడిటర్ వాయిస్

## అటు గోదావరి.. ఇటు ఉత్తరాంధ్ర.. వైసీపీ నయా వ్యూహం!

వైసీపీ గోదావరి జిల్లాలలో రాజకీయ కాపుదల కోసం చూస్తోంది. కాపులదే రాజకీయం ఇక్కడ అన్నది 2024 ఎన్నికల్లో వైసీపీ గుర్తించడంలో విఫలం అయింది. వైసీపీ రాజకీయం ఇపుడు చర్చకు తావిస్తోంది. ఒక వైపు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మీద నిత్యం విమర్శలు చేస్తూ ఆందోళనలు నిర్వహిస్తూ జనంలో రచ్చ చేస్తున్న వైసీపీ అదే సమయంలో పోయిన చోటనె వెతుక్కునేందుకు సరికొత్త వ్యూహాలను అనుసరిస్తోంది. కాపులను తిరిగి దగ్గరకు తీసుకోవాలని వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు ఇటీవల కాలంలో ఆ పార్టీ నుంచి అధికమయ్యాయని అంటున్నారు. వైసీపీ ఏకంగా డెబ్బై సీట్ల మీద ఫుల్ ఫోకస్ పెట్టేసింది అని అంటున్నారు. ఈ డెబ్బై సీట్లలో మెజారిటీని వచ్చే ఎన్నికల్లో గెలుచుకుంటేనే 2029లో తిరిగి అధికారం దక్కుతుందన్నది వైసీపీ భారీ ప్లాన్ గా ఉంది అని అంటున్నారు.

**గోదావరితో కాపు :** వైసీపీ గోదావరి జిల్లాలలో రాజకీయ కాపుదల కోసం చూస్తోంది. కాపులదే రాజకీయం ఇక్కడ అన్నది 2024 ఎన్నికల్లో వైసీపీ గుర్తించడంలో విఫలం అయింది. దానికి గానూ భారీ మూల్యమే చెల్లించుకుంది. ఒక్కటి అంటే ఒక్క సీటు కూడా ఉభయ గోదావరి జిల్లాలలో వైసీపీ పొందలేకపోయింది. దానికి తోడు జనసేన ప్రభావం కానీ పవన్ చరిష్మాను కానీ అంచనా కట్టలేకపోయింది. వైసీపీకి బలమైన కాపు నేతలు ఉన్నా ఇతర సామాజిక వర్గాలను ముందుకు తెచ్చి కాపు జిల్లాలలో ఆధిక్యం చూపిద్దామనుకున్న భంగపడింది. దాంతో ఇపుడు గోదవారి జిల్లాలలో రిపేర్లు వైసీపీ మొదలెట్టింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అధినేత జగన్ ఆక్వా రైతుల పరామర్శను కూడా చూడాలని అంటున్నారు.

**ముద్రగడ లేని లోటు :** మరో వైపు చూస్తే కాపుల ఐకాన్‌గా ఉన్న ముద్రగడ పద్మనాభం మృతి చెందడం వైసీపీకి గోదావరి జిల్లాలలో తీరని లోటుగా ఉంది. అదే సమయంలో ఆ లోటుని భర్తీ చేసుకోవడానికి ఆ సామాజిక వర్గానికి చెందిన ఇతర నాయకులను ఎక్కడికక్కడ ప్రోత్సహించడంతో పాటు ముద్రగడ పట్ల జనంలో ఉన్న సానుభూతిని ఏకపక్షంగా తమ వైపు తిప్పుకోవాలని వైసీపీ పెద్దలు చూస్తున్నారు. ఇక అధినేత జగన్ ఏకంగా ముద్రగడ అంత్యక్రియలలో పాల్గొని ఏకంగా ఆయన పాడె సైతం మోసిన ఉదంతాన్ని కూడా ఈ సందర్భంగా విశేషంగా చూస్తున్నారు. అదే సమయంలో రాజమండ్రిలో జరిగిన ముద్రగడ సంస్మరణ సభకు మొత్తం వైసీపీ కాపు నేతలు అంతా హాజరు కావడం రానున్న రోజుల్లో గోదావరి జిల్లాలలో ముద్రగడ పేరుతో రీసౌండ్ చేయడానికి వైసీపీ రెడీ అయింది అన్న సంకేతాలను ఇస్తోంది అని అంటున్నారు.

**త్వరలో భారీ సభతో :** ఇక ఉత్తరాంధ్ర జిల్లాలలో కూడా వైసీపీ నయా ప్లాన్ తో సిద్ధంగా ఉంది అని అంటున్నారు. ఈ మూడు జిల్లాలలో తూర్పు కాపులు అధికంగా ఉన్నారు వారిని మచ్చిక చేసుకుని వైసీపీతో మమేకం చేయడానికి వైసీపీ భారీ యాక్షన్ ని రెడీ చేసి పెట్టింది. తొందరలోనే ఉత్తరాంధ్ర జిల్లాలలో కాపులతో ఒక భారీ సభను వైసీపీ నిర్వహించబోతోంది అని అంటున్నారు. ఈ సభలో తూర్పు కాపులను ఆకట్టుకునే విధంగా వైసీపీ హామీలు ఉంటాయని అంటున్నారు. అలాగే వారికి రాజకీయ భరోసాతో పాటు వైసీపీతో ఉండేలా చేసేందుకు బొత్స సత్యనారాయణ వంటి వారు రంగంలోకి దిగుతున్నారు.


**అధికారానికి ఇదీ లెక్క :** ఇక ఉత్తరాంధ్రాలో 34 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అలాగే ఉభయ గోదావరి జిల్లాలలో మరో 34 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఈ రెండూ కలిపితే 68 అవుతాయి. 2029 నాటికి ఇందులో కనీసంగా 40 దాకా సీట్లు అయినా వైసీపీ గెలుచుకుంటే గ్రేటర్ రాయలసీమలో ఉన్న 74 సీట్లలో 50 సీట్లకు తక్కువ లేకుండా గెలిస్తే ఇక మధ్య కోస్తాంధ్రాలో మరో పది నుంచి పదిహేను దాకా రాబట్టుకుంటే మంచి మెజారిటీతో అధికారంలోకి రావచ్చు అన్నది వైసీపీ ఎత్తుగడగా ఉంది అని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## 'మమ్మీ, డాడీ సారీ.. నా ఇన్సూరెన్స్ డబ్బుతో వైద్యం చేయించుకోండి'



### సచివాలయంలో ఉరివేసుకుని ఏఎన్ఎం ఆత్మహత్య

**చిల్లకూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామ సచివాలయంలో ఉరివేసుకుని ఏఎన్ఎం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం తొణుకుమాలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓజిలి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన శ్రీపతి సాయి చందన ప్రియ (27) తొణుకుమాల సచివాలయం పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఏడాది క్రితం బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. సచివాలయంలో ఎవరూ లేని సమయంలో తన చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకుని మృతిచెందారు. వివిధ పనుల నిమిత్తం అక్కడికి వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకుని పరిశీలించారు. ఘటనాస్థలంలో సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో "మమ్మీ, డాడీ.. మన్నించండి. నా చావుకు ఎవరూ కారణం కాదు. నేను రూ.60లక్షల ఇన్సూరెన్స్ చేశాను. నా మరణానంతరం వచ్చే మొత్తంతో మీరు వైద్యం చేయించుకోండి" అని ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గూడూరులోని ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలి తండ్రి రమణయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలో వైద్యం చేయించుకుంటున్నారు. తల్లి సుకుమారి గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఆమెకూ ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే చందన ప్రియ మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు.

## చెరువులోకి దూసుకెళ్లిన కారు.. ఐదుగురి మృతి



**భువనేశ్వర్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒడిశాలో విషాద ఘటన చోటుచేసుకుంది. దేంకానాల్ జిల్లా సదర్ ఠాణా పరిధిలోని మహిషాపుటా వద్ద గురువారం తెల్లవారు జామున ఓ పెళ్లి బృందం కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ప్రమాదాన్ని గుర్తించిన గ్రామస్థులు వెంటనే ట్రాక్టర్ సాయంతో కారును బయటకు తీశారు. అయితే, అప్పటికే కారులో ఉన్న ఏడుగురిలో ఐదుగురు ఊపిరాడక మృతి చెందారు. ప్రాణాలతో బయటపడిన ఇద్దరిని దేంకానాల్ ఆసుపత్రికి తరలించారు. మృతులు బంగురిసింగి గ్రామానికి చెందిన చంద్రకాంత్ స్వయిన్, అవినాష్ సాహు, అభిషేక్ సాహు, రాకేశ్ సాహు, రామ్ సాహులుగా గుర్తించారు. బుధవారం రాత్రి వీరు ఓ వివాహానికి హాజరై, స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా.. ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మరోవైపు కేంఝర్ జిల్లాలో బుధవారం రాత్రి ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. అస్వస్థతకు గురైన తమ కుమారుడిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### పదో అంతస్తు నుంచి దూకి..

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని నార్సింగి పీఎస్ పరిధిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పుప్పాలగూడలో ఈ ఘటన చోటుచేసుకుంది. అపార్ట్‌మెంట్ పదో అంతస్తు పైనుంచి దూకి మబ్బు విష్ణువర్ధన్‌రెడ్డి (24) బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### తెలంగాణ డీజీపీ కార్యాలయంలో

## రివాల్వర్‌తో కాల్చుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న స్వామి తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. రాత్రి విధుల్లో ఉన్న స్వామి.. ఇవాళ ఉదయం 5.30 గంటల సమయంలో వాష్‌రూమ్‌కి వెళ్లి.. అక్కడే రివాల్వర్‌తో కాల్చుకున్నట్టు గుర్తించారు. బెట్టింగ్ యాప్‌లకు బానిసై, అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. "ఆత్మహత్య చేసుకుంటున్నాను. నా భార్య, పిల్లల్ని ఏమీ అనొద్దు. వాళ్లు మంచి వాళ్లు. చనిపోయిన తర్వాత దెయ్యం అయినా సరే.. వాళ్లను జాగ్రత్తగా చూసుకుంటా" అని స్వామి తన డైరీలో రాసుకున్న నోట్‌ను పోలీసులు గుర్తించారు. ఈ ఏడాది జులై 2 నుంచి డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ స్వామి.. స్వగ్రామం భువనగిరి జిల్లా చౌటుప్పల్.

## చీరలు కొనలేదని.. భర్తను కుక్కర్ మూతతో కొట్టి చంపింది

**థాణె, విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్రలోని థాణెలో సునీతాదేవి (30) అనే ఇల్లాలు తన కోసం చీరలు కొనలేదన్న కోపంతో భర్త హరేరామ్ సింగ్ (35)ను కుక్కర్ మూతతో కొట్టి, గొంతు నులిమి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు బుధవారం వెల్లడించారు. సునీతాదేవి స్వస్థలం బిహార్‌లోని రోహతాస్ జిల్లా. థాణె శివారులోని బద్లాపూర్ ఈస్ట్‌లో హరేరామ్, సునీత నివసిస్తున్నారు. చీరలు తేలేదన్న కారణంగా గత శనివారం రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. వాదనలు పెరిగి కోపంతో రగిలిపోయిన సునీత కుక్కర్ మూతతో భర్తను చావగొట్టి, గొంతు నులిమి చంపినట్లు పోలీసులు వివరించారు. మొదట ప్రమాదవశాత్తు దెబ్బ తగిలి చనిపోయినట్లు ఆమె అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. శవపరీక్ష నివేదిక తర్వాత అసలు విషయం బయటపడింది.



# విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు








శుక్రవారం, 24 జూలై, 2026



www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బద్ధత www.viswamvoice.com


# ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

## నేడు రంపచోడవరంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్

**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** నూతనంగా ఏర్పాటైన పోలవరం జిల్లాలో తొలిసారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం రంపచోడవరం పర్యటించనున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0 కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి పాఠశాల విద్యా కమిషనర్ తమీమ్ అన్సారియా, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ కుమార్తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరై ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడానికి జిల్లా యంత్రాంగం గత పది రోజులుగా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత





ఏర్పాట్లు చేపట్టింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంది.

**'తల్లికి వందనం'పై వినూత్న డ్రోన్ ఎల్ఈడి వీడియో ప్రదర్శన**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం ద్వారా అర్హులైన ప్రతి విద్యార్థికి ఆర్థిక సహాయాన్ని పారదర్శకంగా తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేసింది. ఈ పథకం విశేషాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి పోలవరం జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో అత్యాధునిక డ్రోన్ సాంకేతికతతో ఎల్ఈడి డ్రోన్ వీడియో ప్రదర్శనను గురువారం సాయంత్రం నిర్వహించారు. సాయంత్రం 7.00 గంటలకు రంపచోడవరం అంబేద్కర్ సెంటర్ వద్ద, అనంతరం గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహం, ముసురుమిల్లి, బోర్నగూడెం వద్ద ప్రత్యేక డ్రోన్ ఎల్ఈడి వీడియో ప్రదర్శన నిర్వహించబడింది.

ఆకాశంలో డ్రోన్ల సహాయంతో రూపొందించే ఈ వినూత్న ప్రదర్శనలో 'తల్లికి వందనం' పథకం ముఖ్యాంశాలు, ప్రభుత్వం చేపట్టిన విద్యా సంక్షేమ కార్యక్రమాలు ఆకర్షణీయంగా ప్రదర్శింపబడ్డాయి. జిల్లా ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరై ఈ అరుదైన డ్రోన్ ఎల్ఈడి వీడియో ప్రదర్శనను వీక్షించి, అలాగే ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంలో సహకరించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# ఢిల్లీలో దగ్గుపాటిని మర్యాద పూర్వకంగా కలిసిన బత్తుల

## నియోజకవర్గ అభివృద్ధి సహకరించాలని వినతి

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరిని ఢిల్లీలో ఆమె అధికారిక నివాసంలో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



గురువారం శాసనసభ్యులు బత్తుల రాజానగరం నియోజకవర్గ అభివృద్ధిపై పురందేశ్వరి కలిసి ఘనంగా సత్కరిస్తూ, పుష్కరాల దృష్ట్యా అభివృద్ధికి సహకరించాలని పలు ప్రతిపాదనలు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన కేంద్రనిధులు, ప్రాజెక్టుల మంజూరుకు సంబంధించి పలు వినతి పత్రాలను అందజేశారు. 2027 గోదావరి పుష్కరాల దృష్ట్యా రాజమహేంద్రవరం ఎయిర్పోర్ట్,రవాణా అభివృద్ధి,విమాన ఛార్జీల తగ్గింపు, కొత్త విమాన సర్వీసులు, రోడ్లు & ట్రాఫిక్ నివారణ,పర్యావరణం, జంతు ప్రదర్శన,బర్డ్ శాంచ్యురీ, జూలాజికల్ పార్క్,ఆధ్యాత్మిక, పర్యాటకరంగాల అభివృద్ధి, సంబంధిత నిధులు వంటి అంశాలను ఆమె దృష్టి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడపా శ్రీనివాస్, వేగిశెట్టి రాజు, నాతిపాం దొరబాబు, పాల్గొన్నారు.

# నేడు జిల్లావ్యాప్తంగా మెగా పి.టి.యమ్

## తల్లిదండ్రులు ఇద్దరూ తప్పనిసరిగా హాజరు కావాలి జిల్లా కలెక్టర్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ - 4.0 కార్యక్రమాన్ని శుక్రవారం (జూలై 24) జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఇద్దరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గురువారం అమలాపురంలోని వివేకానంద సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు, విద్యా ప్రగతి, సాంకేతిక బోధన, ప్రవర్తనా శైలి వంటి అంశాలపై తల్లిదండ్రులకు సమగ్ర అవగాహన కల్పించడమే మెగా ర్యాలీ ప్రధాన లక్ష్యమని చెప్పారు.జిల్లాలోని 1,409 ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చదువుతున్న 76,132 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ రూపొందించిన నిమిషం-నిమిషం కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధానంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి, అభ్యసన ఫలితాలు, పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ విద్యా పథకాల అమలు, విద్యా వనరుల వినియోగంపై తల్లిదండ్రులకు వివరించనున్నారు. అలాగే విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేయడంతో పాటు లీప్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించనున్నారు.పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, దాతలు, విద్యావేత్తలు, గ్రామ పెద్దలు, సామాజిక నాయకులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలు పాఠశాలలను సందర్శించి కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు, కల్పించిన మౌలిక వసతులు, విద్యా ఫలితాలను తల్లిదండ్రులు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు మెగా ర్యాలీ మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్న కలెక్టర్, ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఇద్దరూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారని చెప్పారు. మెగా పిటిఎం-4.0పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. విలేకరుల సమావేశంలో జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మమ్మీ, జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగేశ్వర రావు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సి.హెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావసరాలకే మా మొదటి ప్రాధాన్యత

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - 45వ డివిజన్లో రూ.52.30 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు అవసరమైన మౌలిక సదు పాయాల కల్పనే తమ తొలి ప్రాధాన్య తని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) స్పష్టం చేశారు. రూ.52.30 లక్షలతో 45వ డివిజన్ పరిధిలోని ఆర్ అండ్ బి వాంబే గృహాల వద్ద ఉన్న కమ్యూ నిటీ హాల్ కు రక్షణ గోడ, షెడ్ నిర్మాణం, రాజీవ్ నగర్ డిపి స్టేషన్ ఎదురుగా ఇందిరానగర్కు అనుసంధా నంగా వెట్ మిక్స్ లేయర్ రహదారి నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీని వాస్ శంఖుస్థాపన చేశారు. అనం తరం ఆయన మాట్లాడుతూ 45వ డివిజన్లోని ఆర్ అండ్ బి కంపోస్ట్ యార్డ్ వద్ద దశాబ్దాలుగా పేరుకు పోయిన లెగసీ వ్యర్థాలను ప్రస్తుతం శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసి తొలగి స్తున్నామన్నారు. కంపోస్ట్ యార్డ్, ఏపీ పేపర్ మిల్లు వంటి పరిశ్రమల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆర్ అండ్ బి కాలనీ, రత్నంపేట, శ్రీలంక, ఇందిరానగర్ ప్రాంతాల ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిం చడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నా మన్నారు. గతంలో ఎమ్మెల్సీగా ఉన్న తన తండ్రి ఆదిరెడ్డి అప్పారావు చొరవ తో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఆర్ అండ్ బి శాఖ నుంచి కార్పొరేషన్కు స్థలం బదిలీ అయ్యిందని గుర్తు చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు ఐదేళ్లపాటు ఆ భవనం నిర్లక్ష్యానికి గురై




పూర్తిగా దెబ్బతిందని, కోర్టు ఆదేశాల తర్వాత పరిశీలించినప్పుడు ఫాల్స్ సీలింగ్తో సహా లోపలి సామగ్రి మొత్తం ధ్వంసమైనట్లు గుర్తించామని తెలిపారు. ఏపీ పేపర్ మిల్స్ సహకారంతో కేవలం రూ.35 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ను పూర్తిగా పునరుద్ధరించామని చెప్పారు. గతంలో సుమారు కోటి రూపాయలతో చేపట్టిన పనులను తాము రూ.35 లక్షలకే పూర్తి చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కమ్యూనిటీ హాల్కు రక్షణ గోడ, భోజనాల వంట కోసం షెడ్, సామగ్రి భద్రపరిచేందుకు రెండు గదులు, 2,000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.25 లక్షలతో పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. రాజీవ్నగర్-ఇందిరానగర్ ప్రాంతాలను అనుసంధానించే రహదారి ప్రతి వర్షాకాలంలో నీట మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, స్థానికులు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. స్థానిక ఇన్చార్జి కొయ్యల రమణ ప్రజల సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో అధికారుల సూచనల మేరకు సుమారు రూ.28 లక్షలతో వెట్ మిక్స్ లేయర్ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే మార్కింగ్ పూర్తి చేసి పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ రహదారి పూర్తయితే ఎంతటి భారీ వర్షాలు వచ్చినా ఇందిరానగర్కు రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఉండదన్నారు. కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణకు ఏపీ పేపర్ మిల్స్ అందించిన రూ.35 లక్షలు, ప్రస్తుతం కార్పొరేషన్ నిధులతో చేపడుతున్న రూ.30 లక్షల పనులు కలిపి సుమారు రూ.65 లక్షల వ్యయంతో అత్యాధునిక కమ్యూనిటీ హాల్ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. 45వ వార్డులో ఇప్పటికే రూ.1.50 కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో రూ.30 లక్షల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈరోజు రూ.52.30 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో మొత్తం అభివృద్ధి వ్యయం రూ.2.20 కోట్లకు చేరిందన్నారు. అదనంగా రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని మరో రూ.10 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రతిపాదించామని, అవి కూడా త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. కంపోస్ట్ యార్డ్, పేపర్ మిల్లు ప్రభావంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బలహీన, దిగువ మధ్యతరగతి కుటుంబాలు అధికంగా నివసించే ఈ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. బలహీన వర్గాల ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, స్థానిక ప్రజలు, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డిగూడెం బాలికల వసతి గృహంలో ఉచిత నిత్యావసర వస్తువుల పంపిణీ

## బాధ్యతగల ప్రజాప్రతినిధిగా స్పందించిన ఎమ్మెల్యే ఆనందరావు - బాలికల వసతి గృహ సమస్యల పరిష్కారానికి హామీ

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** వడ్డిగూడెంలోని ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహ సముదాయంలో విద్యార్థినులకు నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు విద్యార్థినులకు దుప్పట్లు, టవళ్లు, గిన్నెలు, గ్లాసులు, నైట్వేర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఎవరూ లాక్కోలేని ఏకైక సంపద విద్య మాత్రమేనని, అందువల్ల ప్రతి ఒక్కరూ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్ఘాటించారు. అనంతరం వసతి గృహంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చదువుకునే గదుల్లో ఫ్లోరింగ్ సరిగా లేకపోవడం, విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు ప్రస్తుతం ఉన్న రెండు ఇన్వర్టర్లు సరిపోకపోవడం వంటి సమస్యలను వార్డెన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, సమస్యలన్నింటినీ రాతపూర్వకంగా అందజేస్తే తక్షణమే పరిష్కరించి అవసరమైన వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. తన విద్యార్థి దశను గుర్తుచేసుకుంటూ, తాను కూడా హాస్టల్లో ఉండి చదువుకున్న విద్యార్థినేనని, అందుకే ఇక్కడికి వచ్చిన వెంటనే విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నానని తెలిపారు. విద్యార్థినులందరూ శ్రద్ధగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు



చేరుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్, విద్యార్థినులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.






### విద్యా మిత్ర కిట్లను విద్యార్థులకు

# పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్





**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు ప్రయోగశాలలను సమర్థవంతంగా వినియోగించుకుని ప్రయోగాల ద్వారా విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఆర్. మహేష్ కుమార్ సూచించారు. గురువారం అమలాపురంలోని వి. అగ్రహారం మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24న నిర్వహించనున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పిటిఎమ్) 4.0కు ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులతో కలిసి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. విద్యార్థుల విద్యా ప్రగతి, అభ్యసన ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో చర్చించి పూర్తి అవగాహన పొందాలని సూచించారు. ప్రయోగశాలల్లో నిర్వహించే ప్రయోగాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందడంతో పాటు ప్రయోగాత్మక విద్యలో మెరుగైన నైపుణ్యాలు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు. విద్యలో ఆచరణాత్మక విధానమే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తుందని అన్నారు. పాఠశాల సందర్శన సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల హాజరు, బోధన విధానం, తరగతి గదులు, ప్రయోగశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న మూడు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, స్కూల్ బ్యాగులు, బెల్ట్‌లు, బూట్లు, సాక్సులు ప్రతి విద్యార్థికి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానాన్ని మెరుగుపరచడంలో ఇంగ్లీష్--తెలుగు పిక్టోరియల్ నిఘంటువు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పేద కుటుంబాలపై విద్యాభారం తగ్గించి, విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించేందుకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి. మమ్మీ, జిల్లా విద్యాశాఖ అధికారి వి. నాగేశ్వరరావు, సీఎంఓ సుబ్రహ్మణ్యం, ఏపీఓ భీమారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బొట్టు నీటి కోసం ప్రజల అవస్థలు...

## కె.గంగవరం హెడ్‌క్వార్టర్స్‌లో తాగునీటి తీవ్ర కొరత

**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాలన అందించాల్సిన మండల కేంద్రంలోనే తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా కె. గంగవరం మండల హెడ్‌క్వార్టర్స్‌లో ప్రజలు నిన్న రాత్రి నుంచి చుక్క నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**మోటారు మరమ్మతుకు ఇన్ని గంటలా..?**

తాగునీటి సరఫరా చేసే మోటారు నిన్న రాత్రి నుంచి పనిచేయకపోయినా, ఇప్పటి వరకు దానిని మరమ్మతు చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి లోపాన్ని కూడా గంటల తరబడి పరిష్కరించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు విమర్శిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలన్న ఆలోచన కూడా అధికారులు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారి తీరుపై స్థానికుల ఆగ్రహం తాగునీటి సమస్యపై అధికారులను ప్రశ్నించిన స్థానికులకు బాధ్యతాయుతమైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా స్పందించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు వాటిని పట్టించుకోకుండా వ్యవహరించడం సరికాదని వారు మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధులు ఎక్కడ? ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చే ప్రజాప్రతినిధులు, ఇప్పుడు మండల కేంద్రంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా స్పందించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించాలని వారు కోరుతున్నారు. నీటి సరఫరా పునరుద్ధరించకపోతే ఆందోళన చెడిపోయిన మోటారును వెంటనే మరమ్మతు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఖాళీ బిందెలతో మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు. అలాగే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారిపై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# శ్రీ చైతన్య స్కూల్‌లో ఎన్నికల సందడి




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక రామచంద్రపురం శ్రీ చైతన్య స్కూల్‌లో గురువారం స్టూడెంట్ సాధారణ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె.రాము మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నికల మీద అవగాహన కల్పించడం తోపాటు విద్యార్థి దశ నుండే ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి అని తెలియజేసే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం శ్రీ చైతన్య స్కూల్ లో ఈ విధంగా స్టూడెంట్ ఎన్నికలు నిర్వహిస్తామని , స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్. డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ ,స్పోర్ట్స్ కెప్టెన్, సీ.సీ.ఏ కెప్టెన్ లకు విద్యార్థులు ఎన్నికల్లో పోటీ చేశారని తెలియజేశారు. రీజనల్ ఇన్చార్జి నరేష్ మాట్లాడుతూ ఎన్నికల యొక్క విధానాన్ని ప్రజాస్వామ్య విధానములో ఎన్నికల యొక్క ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు తెలియజేసారు . అకడమిక్ కోఆర్డినేటర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడానికి పాఠశాల ఎన్నికల విధానం విద్యార్దులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని తెలియజేశారు.అనంతరం వారు కూడా ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# దస్తావేజుల లేఖర్ల పెన్‌డౌన్ కొనసాగింపు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జీ.ఓ. నెం.396కు వ్యతిరేకంగా దస్తావేజుల లేఖర్లు, అసిస్టెంట్లు, డీటీపీ ఆపరేటర్లు, స్టాంప్ వెండర్లు చేపట్టిన పెన్‌డౌన్ ఆందోళన యథావిధిగా కొనసాగుతుందని జిల్లా కమిటీ ప్రకటించింది. జిల్లా కమిటీ తెలిపిన వివరాల ప్రకారం, ఐజీతో జరిగిన చర్చల్లో స్టేట్ కమిటీ పెన్‌డౌన్‌ను విరమింపజేసే ప్రయత్నాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల దస్తావేజుల లేఖర్లు, అసిస్టెంట్లు, డీటీపీ ఆపరేటర్లు, స్టాంప్ వెండర్లు ఏకగ్రీవంగా తిరస్కరించారు.రాష్ట్ర కమిటీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే పెన్‌డౌన్ కార్యక్రమం కొనసాగించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం దస్తావేజు లేఖర్ల సంఘ అధ్యక్షుడు జున్నూరి సురేష్, కన్వీనర్ మట్టపర్తి రాము, గౌరవ అధ్యక్షుడు గుంటు ఫణిప్రసాద్, సెక్రటరీ పందిరి హరి, జాయింట్ సెక్రెటరీ పెద్దిరెడ్డి దుర్గేష్, సుబ్బు, గనిశెట్టి బోగిరాజు, బొమ్మరాజు, అడపా భూషణం, బొర్రా బుజ్జి, కడలి సత్య నారాయణ, గుమ్మళ్ళ నరేష్,దేగల రాజా, గోపాలం, సిరిపల్లి మూర్తి, పృథ్వి శ్రీను, బండ్రెడ్డి రాజు, శివ,బుజ్జి, భూషణం, గుప్పి, రాజబాబు, కె.వి నాగరాజు సహాయకులు, టైపిస్ట్సుతదితర సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం

# విద్యాసంస్థల బంద్‌కు పీడీఎస్‌యూ పిలుపు




**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థలో జరుగుతున్న వరుస వైఫల్యాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఉదంతాలు, మరియు ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి యువతపై జరిగిన అమానుష లాఠీచార్జీని తీవ్రంగా నిరసిస్తూ డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నేడు (శుక్రవారం, జూలై 24, 2026న) విద్యాసంస్థల బంద్‌కు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టిఏ)ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీ సూత్రధారులను కఠినంగా శిక్షించడంతో పాటు, విద్యార్థుల హక్కుల కోసం సామాజిక పర్యావరణవేత్త సోనమ్ వాంగ్చుక్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, పాలకుల అణచివేత ధోరణి నశించాలని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్త విద్యార్థి సమస్యల పరిష్కార సాధన కోసం జరుగుతున్న ఈ "విద్యాసంస్థల బంద్"కు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, మరియు కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు స్వచ్ఛందంగా సహకరించి పూర్తి స్థాయిలో జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### భారత జాతి ముద్దుబిడ్డలను

# స్మరించుకుందాం

## బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా మంత్రి సుభాష్ నివాళులు

**రామచంద్రపురం / అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య సమరయోధులు, భారత జాతి గర్వకారణమైన మహనీయులు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ మరియు అమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమానికి బాలగంగాధర్ తిలక్ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. స్వరాజ్యం నా జన్మహక్కు, దానిని సాధించుకొని తీరుతాను అనే ఆయన నినాదం దేశ ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిందని పేర్కొన్నారు. అలాగే అమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన గొప్ప విప్లవకారుడని కొనియాడారు. యువతకు ఆయన జీవితం ఆదర్శప్రాయమని, దేశభక్తి, త్యాగం, ధైర్యసాహసాలకు ఆయన ప్రతీకగా నిలిచారని మంత్రి అన్నారు. దేశం కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఈ మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, వారి చూపిన మార్గంలో నడుస్తూ దేశాభివృద్ధికి కృషి చేయాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు

# గురుకుల పాఠశాల ఆవరణలో పారిశుధ్య పనులు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఠానేలంక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల మైదానంలో పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డిని గురువారం తొలగించారు. అప్పా టీమ్ ప్రధాన కార్య దర్శి వడ్డీ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రేవు సురేష్, పేరెంట్స్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ట్రాక్టర్ సహాయంతో శుభ్రం చేయించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఈ పారిశుధ్య పనులు చేపట్టినట్లు ప్రిన్సిపాల్ పి. శకుంతల, వైస్ ప్రిన్సిపాల్ సీతాకుమారి పేర్కొన్నారు.

### డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లాలో మాదిగలకు

# రాజకీయ అవకాశం కల్పించాలి : పెదపూడి శ్రీనివాసు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇంచార్జ్ మంత్రి వర్యులు గౌరవ కింజారపు అచ్చెన్నాయుడుని వారి క్యాంప్ ఆఫీస్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సి సెల్ కార్యనిర్వాహన కార్యదర్శి పెదపూడి శ్రీనివాస్, అచ్చెన్న నాయుడుని కలసి దేశానికీ స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తి అవుతున్న అమలాపురం పార్లమెంట్‌లో జీవించే మాదిగలకు మాత్రం రాజకీయ స్వాతంత్ర్యం రాలేదని మా మాదిగ జాతికి జరిగిన రాజకీయ అన్యాయాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రదాత మా ప్రియతమా జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదిగల పక్షపాతి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకువెళ్లి అమలాపురం పార్లమెంట్‌లో ఉండబడే మాదిగలు తెలుగుదేశం పార్టీ అంటే సొంత కుటుంబంగా భావిస్తారని అనునిత్యం పార్టీ గెలుపుకోసం శ్రమిస్తారని పెద్దమనసుతో మాదిగలకు ఎమ్మెల్సీ పదవి కేటాయించి సట్టసభలకు పంపించాలని నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడుకి వినతి పత్రం సమర్పించిన పెదపూడి శ్రీనివాస్ ఈ సందర్బంగా అచ్చెన్న నాయుడు మాట్లాడుతూ కచ్చితంగా ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా అమలాపురం పార్లమెంట్ లో ఉండబడే తెలుగుదేశం పార్టీ మాదిగ కుటుంబ సభ్యులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే విదంగా నా వంతు కృషి చేస్తానని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారని పెదపూడి శ్రీనివాస్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేసారు.

### వాణి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ శాఖ

# ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** వాణి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం రావులపాలెంలో నూతనంగా వాణి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ బ్రాంచ్ ను కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఎమ్మెల్యే బండారు కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. బ్యాంకు సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేసి, ఖాతాదారులకు అవసరమైన సేవలను సకాలంలో అందిస్తూ వారి ఆదరణ పొందాలని సూచించారు.

### ఉడిమూడిలో మాజీ సర్పంచ్ ప్రసన్న కుమార్‌ను

# పరామర్శించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం మండలం ఉడిమూడి గ్రామంలో ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మాజీ గ్రామ సర్పంచ్ నుకపెయ్యి ప్రసన్న కుమార్‌ను పి. గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల మధ్యకు రావాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# వీఆర్వో సత్యకు జన్మదిన శుభాకాంక్షలు




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** గురువారం కరప మండలం వేళంగి గ్రామం పంచాయతీ రెవిన్యూ అధికారి సత్య పుట్టినరోజు సందర్భంగా పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు సమక్షంలో బర్త్డేకేక్ కట్ చేశారు. ఇటువంటి పుట్టిన రోజులు ఎన్నో జరుపుకోవాలని మంచి ఆయురారోగ్యాలు,ఐశ్వర్యాలు భగవంతుడు ఆమెకు ప్రసాదించాలని పలువురు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యంగా ఉద్యోగరీత్యా గ్రామంలో రెవెన్యూ అధికారిగా మంచి సేవలు అందించారని పలువురు అభిప్రాయపడ్డారు.

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన

# అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారిణి జ్యోతి సురేఖ వెన్నం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** సచివాలయంలో తన చాంబర్‌లో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారిణి జ్యోతి సురేఖ వెన్నం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను ఇటీవల సాధించిన వరల్డ్ కప్ లో సాధించిన పతకాల విశేషాలను మంత్రికి వివరించారు. ఆమె వెంట తండ్రి కూడా పాల్గొన్నారు. జ్యోతి సురేఖ వెన్నం సాధించిన విజయాలను మంత్రి అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



జూలై 30న ఆరు జిల్లాలో

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**1న అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం - ఒక రోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ**
**ఆరు జిల్లాల్లో 11,98,044 మంది లబ్ధిదారులు - రు. 514.42 కోట్లు పంపిణీ : మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ఆగస్టు 1న ప్రారంభిస్తోన్న నేపథ్యంలో ఏపీలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 30న చేపట్టనున్నారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పూర్తి చేసిన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను గౌరవ ప్రధానమంత్రి నరేంద్రమోడీ గారు ఆగస్టు 1వ తేదీన ప్రారంభిస్తున్నారని.. ఈ క్రమంలోనే లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండానే ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో



ఒక రోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఈ ఆరు జిల్లాల్లో మొత్తం 11,98,044 మంది లబ్ధిదారులకు రు. 514.42 కోట్లను పంపిణీ చేస్తారని... పెన్షన్ల పంపిణీ కోసం అవసరమైన నగదు ఉపసంహారణ కార్యక్రమాన్ని ఈ నెల 29నే పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ నెల ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం నేపథ్యంలో లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

# క్వాంటం పరిశోధనలకు అమరావతి అత్యుత్తమ ప్రదేశం

**సీఎం చంద్రబాబుతో క్వాంటినమ్ టెక్నాలజీస్ సీఈఓ రాజీబ్ హజ్రా భేటీ**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు రాష్ట్ర, దేశాభివృద్ధికి తోడ్పడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భవిష్యత్ టెక్నాలజీగా క్వాంటం కంప్యూటింగ్ రంగాన్ని గుర్తించి అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం పని చేయటం ప్రారంభిస్తుందని.. ఇప్పటికే క్వాంటం టెస్టింగ్ ఫెసిలిటీలు ఏపీలో పని ప్రారంభించాయని వెల్లడించారు. అంతర్జాతీయస్థాయి ఫుల్ స్టాక్ క్వాంటం కంప్యూటింగ్ కంపెనీ క్వాంటినమ్ సంస్థ సీఈఓ రాజీబ్ హజ్రా సహా ఆ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అమరావతి క్వాంటం వ్యాలీని క్వాంటం ఇన్నోవేషన్ సహా పరిశోధనలు తదితర అంశాల్లో కీలకమైన హబ్ గా తయారు చేసేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో క్వాంటినమ్ సంస్థ సీఈఓ చర్చించారు. జాతీయ క్వాంటం మిషన్ కు అనుగుణంగా ప్రపంచస్థాయి ఎకోసిస్టంను అభివృద్ధి చేసేందుకు ఏపీతో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు క్వాంటినమ్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. క్వాంటం నైపుణ్యాలు, ఏఐ ఎనెబుల్డ్ క్వాంటం అప్లికేషన్లు, అడ్వాన్స్ కంప్యూటింగ్ రీసెర్చ్, స్టార్టప్ ఇంక్యుబేషన్ టెక్నాలజీల పై పనిచేయాలని సీఎం సూచించారు. గతంలో ఐటీని ప్రోత్సహించామని ఇప్పుడు ఏఐ, క్వాంటం టెక్నాలజీల ద్వారా వేగంగా సమస్యలకు పరిష్కారం అందించాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. క్వాంటం పరిశోధనలకు ఏపీ అమరావతి అత్యుత్తమ ప్రాంతమని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీలో క్వాంటం కంప్యూటర్ పరికరాల ఉత్పత్తితో పాటు అల్గారిథమ్స్ వరకూ సహకారం అందించేందుకు తాము సిద్ధమని క్వాంటినమ్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఉపాధ్యక్షుడు సీతారామకృష్ణ, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.

నేషనల్ హైవే 216 విస్తరణలో భాగంగా 132 కె.వి ట్రాన్మిషన్ తరలింపు పనులపై

# అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు

**జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నేషనల్ హైవే 216 విస్తరణలో భాగంగా 132 కె.వి ట్రాన్మిషన్ తరలింపు పనులపై అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఏపీ ట్రాన్స్-కో అధికారులకు ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు నేషనల్ హైవే, ఏపీ ట్రాన్స్కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నేషనల్ హైవే 216విస్తరణ లో 132 కెవి ట్రాన్మిషన్ ఫోల్స్ మొత్తం 8 ఉన్నాయని, అందులో 2 పోల్స్ మామిడి కుదురు మండలంలో, 6 పోల్స్ రాజోలు మండలం పరిధిలో ఉన్నాయని వాటి టవర్ల, ట్రాన్మిషన్ కారిడార్ల స్థానంలో భూమిని కోల్పోయిన భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విశాఖపట్నం ఆర్ & బి జాతీయ రహదారుల విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్‌కు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఏపీ ట్రాన్స్కో అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని పనులుపై కార్యాచరణ చేపట్టి త్వరతిగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ట్రాన్సమిషన్ తరలింపు పనులపై కానీ కాలయాపన చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ తెలియజేశారు. ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా పనులు త్వరతిగతిన పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ట్రాన్సమిషన్ లైన్ మార్పిడి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, ఎన్‌హెచ్-216 రహదారి విస్తరణ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో అమలాపురం ఆర్డీవో ఎ.సరళావతి, ఆర్‌డబి టూ నేషనల్ హైవే డిఈఈ టి. నిక్కీ, నేషనల్ హైవే216 ఎ.ఈ ఎన్.వి రమణ, ఏపీ ట్రాన్స్-కో డిఈఈ జీవి సత్యనారాయణ, తాసిల్దార్లు మల్లేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పాలకొల్లులో క్రోచెట్ లేస్ కళాకారులకు కంటి పరీక్షలు

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశా నిర్దేశంతో కొనసాగుతున్న ఉచిత వైద్య శిబిరాలు**



**పాలకొల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట మేరకు రాష్ట్రవ్యాప్తంగా హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. గురువారం పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని యలమంచిలిలో క్రోచెట్ లేస్ కళాకారుల కోసం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 217 మంది కళాకారులకు కంటి పరీక్షలు చేశారు. అందులో ఐదుగురికి శుక్లాలు సమస్య ఉన్నట్టు గుర్తించారు. 187 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారించారు. వారికి కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. గత వారం నరసాపురంలో నిర్వహించిన వైద్య శిబిరంలో కంటి చూపు సమస్యలు ఉన్న 142 మంది కళాకారులకి ఉపముఖ్యమంత్రివర్యులు కళ్లద్దాలు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు.

# బీజేపీ ప్రెసిడెంట్ కి సొంత సీటు లేదా...మరి ఎలా?

ఏపీలో బీజేపీ పరిస్థితి ఎలా ఉంది అంటే కూటమిలో జూనియర్ పార్టనర్ గానే అని అంటున్నారు. తాజాగా స్థానిక సంస్థలకు సంబంధించి కూటమి సీట్ల పంపిణీ మీద ఒక నిష్పత్తి బయటకు వచ్చింది. టీడీపీకి 80 శాతం జనసేనకు 15 శాతం, బీజేపీకి 5 శాతం సీట్లు లోకల్ బాడీ ఎన్నికల్లో ఇస్తారు అన్నది ఆ ప్రకటన సారాంశం. అయితే ఇది అఫీషియల్ గా కాదు, అలా ప్రచారం అవుతూ వచ్చింది. దానికే జనసేన భగ్గుమంది. ఏకంగా జనసేన పార్టీలో నంబర్ టూగా ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ అది ఆమోదయోగ్యం కాదని అంటూ బాహాటంగానే చెప్పారు. జనసేన 2024 తో పోలిస్తే బాగా బలపడింది అని కూడా చెప్పారు. అంతే కాదు 2024 లెక్కలు వేరు ఇపుడు లెక్కలు వేరు అని కూడా వివరించే ప్రయత్నం చేశారు. జనసేన సంగతి ఇలా ఉంటే బీజేపీ మ్యాటర్ ఏంటి అంటే ఆలోచించాల్సిందే అంటున్నారు.

**డిమాండ్ చేసేందుకు రెడీనా :** బీజేపీ నేతలు కూడా తమకు ఎక్కువ సీట్లు లోకల్ బాడీ ఎన్నికల్లో ఇవ్వాలని కోరుతున్నారు. కానీ అదంతా అంతర్గతంగానే ఉంది. బాహాటంగా ఆ పార్టీ అయితే తనకు 5 శాతం సీట్లు ఇస్తామని అన్నా ఎక్కడా రియాక్ట్ కాలేదు. ఇక రెండేళ్ల కూటమి భాగస్వామ్యంతో అధికారంలో ఉంటూ బీజేపీ ఏమైనా బలపడిందా అన్నది చూస్తే కనుక పెదవి విరుపు జవాబుగా వస్తోంది అని అంటున్నారు. బీజేపీకి ఈ మధ్యలో ఇద్దరు అధ్యక్షులు మారారు. పురంధేశ్వరి తరువాత పీవీఎన్ మాధవ్ వచ్చారు. ఆయన యువ నేత, బీసీ నాయకుడు పార్టీని దూకుడుగా ముందుకు నడిపిస్తారు అని ఆశ పడిన వారికి బీజేపీ తీరు అయితే ఇంకా అర్ధం కావడం లేదని అంటున్నారు.

**ఎమ్మెల్యేగా పోటీకి అయినా :** ఇదిలా ఉంటే ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ పీవీఎన్ మాధవ్ ఉత్తరాంధ్ర నేపథ్యం ఉన్న వారు. విశాఖ వాసి. అయితే ఆయన ఇప్పటిదాకా ఎమ్మెల్యేగా కానీ ఎంపీగా కానీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆయన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 2017లో పోటీ చేసి టీడీపీ మద్దతుతో గెలిచారు. 2023లో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తే ఓటమి పాలు అయ్యారు. ఇక ఆయన 2029 లో ఎమ్మెల్యేగా లేదా ఎంపీగా పోటీ చేయాలి అంటే ఎక్కడ నుంచి చేస్తారు అన్న చర్చ కూడా సాగుతోంది. ఆయనకంటూ సొంత సీటు అయితే ఇప్పటి దాకా గుర్తించి అక్కడ బలోపేతం చేసుకోలేకపోయారు అన్న చర్చ ఉండనే ఉంది.



**ఉత్తరం వైపు ఫోకస్ పెట్టినా :** ఇక 2014 ఎన్నికల్లో మాధవ్ విశాఖ ఉత్తరం నుంచి పోటీ చేయాలని అనుకున్నారు అంటారు. అయితే లాస్ట్ మినిట్ లో బిగ్ ట్విస్ట్ తో ఆ సీటు విష్ణు కుమార్ రాజుకు వెళ్ళింది. ఆయన గెలిచారు. 2019లో ఓడినా 2024లో మళ్ళీ అదే సీటు నుంచి గెలిచారు. ఇక 2029లో తన వారసురాలిని రంగంలోకి తీసుకుని రావాలని చూస్తున్నారని టాక్ నడుస్తోంది. మరి అక్కడ మాధవ్ పోటీ చేయడానికి వీలు ఉంటుందా ఒకవేళ చేయాలని అనుకుంటే ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకోవాలి కదా అని అంటున్నారు.

**ఏపీలో బలోపేతం చేయాలంటే :** అలాగే ఎంపీగా పోటీ చేయాలనుకుంటే అనకాపల్లి లేదా విశాఖ సీట్లలోనే అవుతుంది. కానీ విశాఖ టీడీపీ వదులుకోదు, అనకాపల్లిలో సీఎం రమేష్ ఉన్నారు. ఆయనే మరోసారి పోటీ చేస్తారు అని అంటున్నారు. మరి మాధవ్ ప్రత్యక్ష ఎన్నికల రాజకీయం ఏ విధంగా ఉండబోతోంది అన్నది అయితే ఇప్పటికి తెలియడం లేదు అని అంటున్నారు. బీజేపీని ఏపీలో బలోపేతం చేయాలంటే పార్టీని పరుగులు తీయించాలంటే ప్రెసిడెంట్ నుంచి కీలక నేతలు తమ సొంత నియోజకవర్గాలలో పార్టీని ముందు గట్టిగా ఉంచుకుంటే ఆ మేరకు కమలం పార్టీకి రెండు డజన్ల చోట్ల బలం పెరుగుతుంది కదా అన్న చర్చ ఉంది. చూడాలి మరి బీజేపీ రాష్ట్ర సారథుల ఆలోచనలు ఏ విధంగా ఉన్నాయో.

నీట్ పేపర్ లీకేజ్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**జులై 24న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ - డివైఎఫ్ఐ**

**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తుతో చలగాటమాడిన నీట్ పేపర్ లీకేజ్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జులై 24న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్ చేయాలని బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వద్ద విలేఖల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన పేపర్ లీకేజీలో దేశ విద్య వ్యవస్థ పై విద్యార్థులలో తీవ్ర ఆందోళనను కలిగించాయని అన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నీట్ పరీక్షల అవకతవకాలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే జోక్యం చేసుకొని స్వతంత్ర, పారదర్శక విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జులై 24న నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్ ను విద్యాసంస్థల యాజమాన్యాలు సంపూర్ణ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు సోమిరెడ్డిపల్లి అరవింద్, ఉపాధ్యక్షులు సంగటి దేవకుమార్, నాయకులు సిద్దులు పాల్గొన్నారు.



# ఢిల్లీలో ఎంపీ పురందేశ్వరితో ఎమ్మెల్యే బత్తుల భేటీ

## రాజానగరం అభివృద్ధికి కేంద్ర నిధులు, పలు కీలక ప్రాజెక్టులకు వినతి



**న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరిని ఢిల్లీలోని అధికారిక నివాసంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, కేంద్ర నిధుల మంజూరు, కొత్త ప్రాజెక్టుల ఆమోదంపై విస్తృతంగా చర్చించారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని రవాణా, రహదారులు, పర్యాటకం, ఆధ్యాత్మిక కేంద్రాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అనేక ప్రతిపాదనలను ఎంపీకి అందజేశారు. ఎయిర్‌పోర్టు విస్తరణతో ప్రభావితమైన గ్రామాల్లో నీటి ప్రవాహ వ్యవస్థ పునరుద్ధరణ, రోడ్ల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. రాజమహేంద్రవరం-హైదరాబాద్ విమాన ఛార్జీల నియంత్రణ, కొత్త విమాన సర్వీసులు, విమానాల మరమ్మత్తుల కేంద్రం ఏర్పాటుకు విజ్ఞప్తి చేశారు. బొబ్బిల్లంక-వేమగిరి రింగ్ రోడ్, గామన్ జంక్షన్ వద్ద అదనపు ర్యాంపు, రాజానగరం-నరేంద్రపురం వద్ద ఫ్లైఓవర్ లేదా అండర్‌పాస్, రాజానగరం-బూరుగుపూడి రహదారి విస్తరణ, మురారి-పురుషోత్తపట్నం రహదారి, రాజానగరం-రాజమహేంద్రవరం హైవేపై సోలార్ లైటింగ్, రాజమహేంద్రవరం-గోకవరం రహదారి అభివృద్ధి వంటి ప్రతిపాదనలు చేశారు. రాజానగరం మండలంలోని పుణ్యక్షేత్రం గ్రామంలో వలస పక్షుల సంరక్షణ కోసం బర్డ్ శాంక్చురీ అభివృద్ధికి నిధులు, అటవీ ప్రాంతంలో జూ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధి, కాపవరం బౌద్ధ వారసత్వ ప్రదేశం, కనుపూరు కొండ, రామదుర్గం, ఏనుగుల కొండలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. రాజానగరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని బత్తుల బలరామకృష్ణ తెలిపారు. ప్రతిపాదనలపై ఎంపీ పురందేశ్వరి సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వేగిశెట్టి రాజు, నాతిపాం దొరబాబు, అడపా శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రికార్డులకు బ్లాక్ చెయిన్ భద్రత

## కడియం మండలంలో పైలట్‌గా 'మీ భూమి' అమలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'మీ భూమి-బ్లాక్‌చెయిన్' పైలట్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. తొలి దశలో ఎంపిక చేసిన ఏడు మండలాల్లో తూర్పుగోదావరి జిల్లా నుంచి కడియం మండలం చోటు దక్కింది. కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్‌తో పాటు రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్, వ్యవసాయ, పరిశ్రమలు, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం భూ రికార్డులు డిజిటల్ రూపంలో ఉన్నప్పటికీ, వివిధ శాఖల్లో డేటా వ్యత్యాసాలు, రికార్డుల మార్పులపై సమస్యలు ఉన్న నేపథ్యంలో బ్లాక్‌చెయిన్ ఆధారిత వ్యవస్థను రూపొందించారు. ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక గుర్తింపు కల్పించి, ప్రతి లావాదేవీని మార్పులకు అవకాశం లేకుండా శాశ్వతంగా నమోదు చేసే విధంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. రికార్డుల్లో జరిగే ప్రతి మార్పు ఎవరు, ఎప్పుడు చేశారనే వివరాలు నమోదవుతాయి. ఏదైనా వ్యత్యాసం తలెత్తితే సంబంధిత లావాదేవీని వెంటనే నిలిపివేసే భద్రతా వ్యవస్థను కూడా ఏర్పాటు చేశారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ ప్రాజెక్టులో తొలి దశలో ఆటో మ్యుటేషన్, సబ్ డివిజన్, విస్తీర్ణ సవరణ వంటి సేవలు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ఏడు మండలాల్లోని 89 రీ సర్వే గ్రామాలు, 1,37,763 భూ పార్సెల్ మ్యాప్‌లను ఈ పైలట్‌లో చేర్చారు. ప్రజలకు పారదర్శకమైన, భద్రమైన భూ రికార్డుల వ్యవస్థను అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. సమావేశం అనంతరం కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్లాక్‌చెయిన్ ద్వారా లభించే భద్రత, పారదర్శకతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. భూ రికార్డుల ఆధారంగా రుణాలు, రాయితీలు, ఇతర సేవలు అందించే శాఖలు కూడా ఈ డేటాను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. పైలట్ అమలులో ఎదురయ్యే అంశాలను ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ రూపంలో తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో భాస్కరరెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ వెంకటేశ్వరరావు, రిజిస్ట్రేషన్, వ్యవసాయ, పరిశ్రమలు, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్ తూర్పుగోదావరి జిల్లా తొలి కార్యవర్గ సమావేశం




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లా శాఖ మొదటి కార్యవర్గ సమావేశం ఆర్‌డబి గెస్ట్ హౌస్ లో గురువారం ఉదయం 11 గంటలకు జరిగింది. గౌరవ అధ్యక్షుడు నాంబత్తుల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు పూర్తి స్థాయిలో హాజరయ్యారు. ఏప్రిల్ 30వ తేదీన మహాసభ జరిగిన పిమ్మట ఇదే తొలి సమావేశం కావడంతో ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో జిల్లా అధ్యక్షులు వెలుగూరి రవి కుమార్ పూర్తి స్థాయిలో సంఘ విధి విధానాలను మరొక సారి వారికి తెలియచేసి వారి బాధ్యతలు వివరించారు. నాంబత్తుల రాంబాబు మాట్లాడుతూ సంఘ సభ్యుల బాధ్యతలు సభ్యులకు వివరిస్తూ రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన విధానాలు తెలియచేసారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో యూనియన్ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. సభ్యత్వాల నమోదు పెంచేందుకు తీసుకోవలసిన చర్యలను చెబుతూ సభ్యులు సహకారించాలని కోరారు. సీనియర్ జర్నలిస్టు లాల్ మాట్లాడుతూ మండల స్థాయిలో సంఘాన్ని బలోపేతం చెయ్యాలని సభ్యత్వాల నమోదు ఉదృతం చెయ్యాలని ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. త్వరలో జర్నలిస్ట్ ల ఇళ్ల స్థలాలు, జర్నలిస్ట్ పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ ల విషయం పై ఫెడరేషన్ సభ్యులు కలెక్టర్ ను కలవనున్నట్టు గౌరవ సలహాదారు వరదా నాగేశ్వరావు తెలిపారు. సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా కోశాధికారి బాబురావు(నల్లజర్ల), ఉపాధ్యక్షులు చెన్న త్రినాథ్, ఆంజనేయులు (గోపాలపురం), విశాలాక్షి, సహాయ కార్యదర్శులు, సూర్య చంద్ర రావు, (కడియం), నరసింహ రావు (కోరుకొండ), ఈశ్వరావు (రాజానగరం), కార్యవర్గ సభ్యులు ప్రసాద్ (శుభోదయం), కరీముల్లా, బి.నాగేశ్వరావు, కుక్కల శ్రీనివాస్ (పెరవలి), హరి గణేష్, ఆకుల విజయ భారతి,వినోద్(నల్లజర్ల), సుబ్బారావు (మండపేట), లాల్,వై.శ్రీనివాస్ (కడియం), ఈ కార్యవర్గ పూర్తి నివేదికను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుకు పంపనున్నట్లు ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు తెలియచేసారు.

# 29న 3600అడుగుల భారీ జాతీయ జెండా ప్రదర్శన

## జేఎన్ రోడ్డు మన్యం గార్డెన్స్ నుంచి 3000మంది విద్యార్థులతో నిర్వహణ
## వాసవీ క్లబ్స్ ఇంటర్ నేషనల్ చీఫ్ ఎడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ బోడా సాయి సూర్య ప్రకాష్ వెల్లడి




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వాసవీ క్లబ్స్ ఇంటర్ నేషనల్ విద్యార్థుల్లో జాతీయ భావాన్ని, సమగ్రతను చాటిచెప్పేందుకు ఈనెల 29న భారీ జాతీయ జెండా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్స్ ఇంటర్ నేషనల్ ఛీఫ్ ఎడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ బోడా సాయి సూర్య ప్రకాష్ వెల్లడించారు. వాసవీ క్లబ్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు సిద్దా వెంకట సూర్యప్రకాశరావు ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక గణేష్ చౌక్‌లోని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 29వ తేదీ ఉదయం 9గంటలకు జె ఎన్ రోడ్డులోని మన్యం గార్డెన్స్ నుంచి 3600అడుగుల పొడవు, 11అడుగుల వెడల్పు గల జాతీయ జెండాతో ప్రదర్శన ప్రారంభిస్తామని చెప్పారు. శ్యామలానగర్, రామాలయం జంక్షన్, ఏవి అప్పారావు రోడ్డు, హ్యాపీ స్ట్రీట్ మీదుగా 12గంటలకు తిరిగి మన్యం గార్డెన్స్ కి ప్రదర్శన చేరుతుందని సాయి సూర్య ప్రకాష్ చెప్పారు. దాదాపు 3000మంది విద్యార్థులు ఈ ప్రదర్శనలో భాగస్వాములవుతారని ఆయన తెలిపారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ , మిరాకిల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు కూడా దీన్ని రికార్డు చేయడానికి వస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా తమ క్లబ్ తో పాటు రాజమండ్రికి, ప్రజలకు అందరికీ మంచి పేరు వస్తుందని ఆయన అన్నారు. ప్రదర్శనలో పాల్గొనే విద్యా ర్థులకు స్నాక్స్, మంచినీళ్లు, మజ్జిగ, గ్లూకోజ్ కూల్ డ్రింక్ వంటివి ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయ ప్రదం చేయాలనీ అయన కోరారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యాన చేస్తున్న సేవా కార్యక్రమాలను సాయి సూర్య ప్రకాష్ వివరించారు. వైశ్యులలో పేదవారి పిల్లలకు రూ 25వేలు ఆర్థిక సాయ అందిస్తున్నామని ఆయన చెప్పారు. అలాగే ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలకు చేయూతగా రూ 25వేలు సాయం అందిస్తున్నామని ఆయన తెలిపారు. విద్య, వైద్య వంటి సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ బోడా వీర్రాజు, డిస్ట్రిక్ట్ కేబినెట్ సెక్రటరీ ఎన్ ఎస్ బి రాజేష్ సమావేశంలో పాల్గొన్నారు.

### నాగంపల్లి గ్రామంలో

# 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నాగంపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డి.శ్రీనివాస్, సీతానగరం వ్యవసాయ అధికారి ఏ.గౌరీ దేవి పాల్గొన్నారు. ప్రధాన మంత్రి పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గడువులోపు బీమా నమోదు చేసుకుని పంటలకు రక్షణ కల్పించుకోవాలని కోరుకొండ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డి.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.ప్రకృతి వైపరీత్యాలు, అధిక వర్షాలు, అనావృష్టి, తుఫానులు, వరదలు, వడగళ్ల వాన, ఇతర అనివార్య పరిస్థితుల వల్ల పంటలకు కలిగే నష్టాల నుంచి రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి పంటల బీమా యోజన (పి.ఎం.ఎఫ్.బి.వై) ను రైతులు తప్పనిసరిగా సద్వినియోగం చేసు కోవాలని సీతానగరం మండల వ్యవసాయాధికారి ఏ. గౌరీదేవి కోరారు.ఈ పథకం కింద వరి పంటకు ఎకరానికి రూ.40,000 బీమా రక్షణ లభిస్తుందని, రైతు వాటా ప్రీమియం 1.5 శాతం (ఎకరానికి రూ.570) మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మినుముల పంటకు రూ.20,000 బీమా రక్షణ, రైతు వాటా 1.5 శాతం (ఎకరానికి రూ.300) ఉంటుందని పేర్కొన్నారు. అరటి పంటకు రూ.60,000 బీమా రక్షణ లభించగా, రైతు వాటా 5 శాతం (ఎకరానికి రూ.3,000) మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని వివరిం చారు.గడువు తేదీలోగ దరఖా స్తులు.చేసుకోవాలని ఆమె కోరా రు.బీమా నమోదు సమయంలో రైతులు ఆధార్, భూమి పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు, పంట సాగు వివరాలు, అవసరమైన ఇతర ధ్రువపత్రాలు సిద్ధంగా ఉంచు కోవాలని సూచించారు. నమోదు పూర్తయిన తర్వాత బీమా పాలసీని తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకుని భద్రపరచుకోవాలని సూచించారు. సీతానగరం మండలంలోని రైతులం దరూ కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని మండల వ్యవసాయాధి కారి ఏ. గౌరీదేవి విజ్ఞప్తి చేశారు.

# ముద్రగడకు నివాళి..

## కుటుంబ సభ్యులను పరామర్శించిన పంతం కొండలరావు, అద్దేపల్లి శ్రీధర్



**కిర్లంపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి, ప్రజా నాయకుడు ముద్రగడ పద్మనాభం ఆకస్మిక మరణం పట్ల పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండల రావు, అద్దేపల్లి శ్రీధర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం కిర్లం పూడిలోని ముద్రగడ నివాసానికి వెళ్లిన వారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ముద్రగడ ప్రజా జీవితంలో చూపిన నిబద్ధత, సామాజిక న్యాయం కోసం చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం ఆయన నిరంతరం పోరాడారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ముద్రగడను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని అన్నారు. ముద్రగడ తనయులు బాలు, గిరిలను పరామర్శించిన పంతం కొండలరావు.

# సెప్టెంబరు 15 నాటికి అందుబాటులోకి గోదావరి రివర్‌ఫ్రంట్




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం నగరంలోని గోదావరి రివర్‌ఫ్రంట్ నిర్మాణ పనులను సెప్టెంబరు 15 నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసు కురావాలని నగరపాలక సంస్థ కమిష నర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. గురువారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి రివర్‌ఫ్రంట్ పను లను పరిశీలించిన ఆయన, నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా సాగాలని సూచించారు. జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా పనులు పూర్తయ్యే వరకు ప్రజలను నిర్మాణ ప్రాంతంలోకి అనుమతించవద్దని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా ప్రతి దశలో ప్రమాణాలు పాటించాలని సూచించారు. అలాగే పీవీ నరసింహారావు పార్కును ఆగస్టు 15 నాటికి పూర్తిచేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కార్యనిర్వహణ ఇంజినీరు మదర్షా అలీతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 29వ తేదీ గురు పౌర్ణమి సందర్భంగా గోడపత్రిక ఆవిష్కరణ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న సాయిబాబా ఆలయంలో "గురు పౌర్ణమి గోడ పత్రిక"ను ఆలయఅర్చకులు ఆలయ కమిటీసభ్యుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. గురువారం సాయి బాబా ఆలయంలో ఈనెల 29వ తేదీ గురు పౌర్ణమి పర్వదినాన్ని పుర స్కరించుకొని, బాబావారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయని, యావన్మంది భక్తులు ఈ కార్యక్రమం పాల్గొని బాబా వారి ఆశీస్సులు పొందాలని ఆలయ అర్చకులు రామకృష్ణాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదాంతం రామకృష్ణాచార్యులు, ఆలయ కమిటీసభ్యులు తాడి హరిచంద్ర ప్రసాద్ రెడ్డి,కటకం చలం,బెల్లం దుర్గాప్రసాద్, కేతినేని అశోక్ కుమార్, ముత్యం హరి, రెడ్డి, ప్రభాకర్, సత్తిబాబు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# ఏం ఐడియా సర్ జీ..

**స్క్రీన్ దగ్గరకు ఫ్యాన్స్ రాకుండా థియేటర్ ఓనర్స్ ఏం చేశారో చూడండి..**



ఎట్టకేలకు అడియన్స్ ముందుకు వచ్చేసింది జన నాయగన్. ఈ చిత్రాన్ని తెలుగులో జన నాయకుడు పేరుతో రిలీజ్ చేశారు మేకర్స్. అనేక అడ్డంకులు తొలగి.. ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు ఉదయం నుంచి పాజిటివ్ రివ్యూస్ వస్తున్నాయి. అటు ఉదయాన్ని అధికారులతో కలిసి సినిమా వీక్షించారు సీఎం విజయ్. మరోవైపు త్రిష, కీర్తి సురేష్, మమితా బైజు వంటి తారలు థియేటర్లలో సందడి చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన చివరి చిత్రం జన నాయగన్. ఇదివరకే ఎప్పుడో రిలీజ్ కావాల్సిన ఈ సినిమా అనేక అడ్డంకులు, వివాదాలు దాటుకుని ఇప్పుడు థియేటర్లలో రిలీజ్ అయ్యింది. డైరెక్టర్ హెచ్ వినోద్ దర్శకత్వం వహించిన ఈ మూవీకి ఉదయం నుంచి ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూస్ వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ సినిమా ప్రదర్శితమవుతున్న థియేటర్లో ఓనర్స్ చేసిన పని చూసి షాకవుతున్నారు అడియన్స్. ఈ విధంగా పుదుక్కోట్టై జిల్లాలోని అన్ని థియేటర్లలోఈ చిత్రాన్ని ప్రసారం చేస్తున్నారు. అయితే అరంతంగిలోని 'సుబా' అనే ప్రైవేట్ థియేటర్‌లో కూడా ఈ మూవీని విడుదల చేశారు. విడుదలైన మొదటి రోజే కావడంతో, చిత్రాన్ని వీక్షించడానికి పెద్ద సంఖ్యలో అభిమానులు థియేటర్‌కు తరలివచ్చారు. ఆ సమయంలో థియేటర్‌లోకి వెళ్లిన విజయ్ అభిమానులు షాక్‌కు గురయ్యారు. ఎందుకంటే, థియేటర్ సిబ్బంది స్క్రీన్ ముందు ఉన్న ముళ్ల చెట్టు కొమ్మలను నరికివేసి అడ్డుగా బారికేడ్ ఏర్పాటు చేశారు. దీంతో అభిమానులు, సాధారణ ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. దీని కారణంగా, అభిమానులు తెర దగ్గరకు వెళ్లి సంబరాల్లో పాలుపంచుకోలేకపోయారని వారు తెలిపారు. ఇటీవలే థియేటర్‌లో సినిమా చూసిన అభిమానులు, థియేటర్‌లోని సీట్లు, తెర మొదలైనవాటిని పాడుచేశారు. దీనిని నివారించడానికి, థియేటర్ యాజమాన్యం ముళ్ల చెట్ల కొమ్మలను అడ్డుగా ఏర్పాటు చేసినట్లు సమాచారం. థియేటర్ ఆస్తులు, అభిమానుల భద్రతను నిర్ధారించడానికి ఈ చర్య తీసుకుని ఉండవచ్చని అంటున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ విషయం అరంతంగితో పాటు ఇతర ప్రాంతాల విజయ్ అభిమానుల మధ్య చర్చనీయాంశంగా మారింది. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నటించిన 'జన్యాయన్' చిత్రం గత జనవరిలో విడుదల కావాల్సి ఉంది. అయితే, సెన్సార్ సర్టిఫికేట్ రాకపోవడం, అసెంబ్లీ ఎన్నికల సమస్య కారణంగా 'జన్యాయన్' సినిమా విడుదల వాయిదా పడింది. ఈ పరిస్థితిలో, 'జన్యాయన్' సినిమా ఈరోజు విడుదల అవుతుందని కొన్ని రోజుల క్రితం చిత్ర నిర్మాణ బృందం నుండి అధికారిక సమాచారం వెలువడింది. దాని ఆధారంగా, 'జన నాయగన్' సినిమా తమిళనాడు అంతటా విడుదల కావడం గమనార్హం.




**చిరంజీవితో బ్లాక్ బస్టర్ హిట్.. రాత్రికి రాత్రే స్టార్ డమ్.. కట్ చేస్తే..**

# 30 ఏళ్ల తర్వాత రీఎంట్రీ ఇస్తున్న హీరోయిన్..



ఒకప్పుడు భారతీయ సినీ పరిశ్రమలో ఆమె స్టార్ హీరోయిన్. ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయిన ప్పటికీ అప్పట్లో తెలుగు కుర్రకారు ఆరాధ్య దేవతగా మారిపోయింది. ఇక ఇప్పుడు దాదాపు 30 ఏళ్ల తర్వాత సినిమాల్లోకి రీఎంట్రీ ఇస్తుంది. ఇంతకీ ఆమె ఎవరంటే. 80-90వ దశకాలలో అగ్ర కథానాయికగా ఓ వెలుగు వెలిగింది హీరోయిన్ మీనాక్షి శేషాద్రి. హిందీ, తెలుగు చిత్రాల్లో నటించి తనదైన ముద్ర వేసింది. మెగాస్టార్ చిరంజీవి జోడీగా అపద్భాంధవుడు చిత్రంలో నటించి ఓవర్ నైట్ స్టార్ డమ్ సంపాదించు కుంది. అయితే తెలుగులో మంచి హిట్ అందుకున్నప్పటికీ అంతగా అవకాశాలు రాలేదు. దీంతో బాలీవుడ్ షిఫ్ట్ అయిన ఈ అమ్మడు అక్కడే వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉండిపోయారు. కెరీర్ మంచి ఫాంలో ఉన్నప్పుడే పెళ్లి చేసుకున్న ఆమె.. గత కొన్నేళ్లుగా బాలీవుడ్‌కు దూరంగా ఉన్నారు. ఆమె విదేశాల్లో స్థిరపడ్డారు. ఇప్పుడు మీనాక్షి శేషాద్రి తిరిగి రాబోతున్నారని, అది కూడా 40 ఏళ్ల క్రితం తన సహనటుడు జాకీ ష్రాఫ్‌తో కలిసి అని వార్తలు వస్తున్నాయి. నివేదికల ప్రకారం, మీనాక్షి శేషాద్రి జాకీ ష్రాఫ్‌తో మరోసారి తెరపై కనిపించనున్నారు. అయితే, ఈసారి అది సినిమా కాదని, ఒక వెబ్ సిరీస్ అని అంటున్నారు. నివేదిక ప్రకారం, విపుల్ షా వెబ్ సిరీస్ 'నానావతి వర్సెస్ నానావతి' ద్వారా మీనాక్షి శేషాద్రి నటనలోకి రీఎంట్రీ చేయబోతున్నారనే వదంతులు వినిపిస్తున్నాయి. ఈ సిరీస్‌లో జాకీ ష్రాఫ్, మీనాక్షి శేషాద్రితో కలిసి పనిచేయనున్నారని టాక్. చాలా కాలం తర్వాత ఈ జంట మళ్లీ కలిసి కనిపించనుంది. వీరిద్దరూ గతంలో 1983లో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'హీరో'లో కలిసి కనిపించారు. ఈ సిరీస్‌లో మీనాక్షి శేషాద్రితో పాటు భాగ్యశ్రీ, రామ్ కపూర్, అనుప్రియ గోయెంకా కూడా ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం. అయితే, ఈ వెబ్ సిరీస్ ఎప్పుడు విడుదలవుతుందనే దానిపై అధికారిక సమాచారం ఏదీ లేదు.

# అరె..ఎవరీ మనిషి..

**అచ్చం మన హీరో రవితేజలా ఉన్నాడు..**



ఈ వ్యక్తి అచ్చు గుద్దినట్లు సేమ్ టు సేమ్ మన మాస్ మహారాజా రవితేజ లాగే కనిపిస్తున్నాడు. ఇప్పుడు ఇతనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. ఇదే క్రమంలో ఈ వీడియోను చూసిన నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ప్రపంచంలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని పెద్దలు చెబుతుంటారు. అయితే ఏడుగురు కాకపోయినా కనీసం ఒకరు, ఇద్దరు ఒకే పోలికలతో ఉన్న వ్యక్తులు అప్పుడప్పుడు మనకు తారసపడుతుంటారు. ఎలాంటి రక్త సంబంధం బంధుత్వం లేకున్నా ఒకే పోలికలతో కనిపించే వ్యక్తులు అక్కడక్కడ కనిపిస్తుంటారు. సాధారణంగా ఇలాంటి వారిని ఇంగ్లిష్ లోడొపెల్ గ్యాంగర్స్ లేదా ట్విన్ స్ట్రేంజర్స్ అని పిలుస్తుంటారు. ముఖ్యంగా సెలబ్రిటీల విషయంలో ఇలా ఒకే పోలికలు ఉన్న వ్యక్తులు మనకు ఎక్కువగా కనిపిస్తుంటారు. సోషల్ మీడియాలోనూ వీరి ఫొటోలు, వీడియోలు తెగ వైరలవుతుంటాయి. గతంలోఐశ్వర్యారాయ, అనుష్కా శర్మ, సమంత, మహేష్ బాబులను పోలిన వ్యక్తులు సోషల్ మీడియాలో బాగా హైలెట్ అయ్యారు. రీసెంట్ గానే మలేషియాలో ఒక వ్యక్తి సేమ్ టు సేమ్ అచ్చం మన బాలయ్య బాబులాగే కనిపించాడు. అతనికి సంబంధించిన వీడియోలు కూడా బాగా వైరలయ్యాయి. అలా ఇప్పుడు అచ్చం మన మాస్ మహారాజా రవితేజలా ఉన్న ఓ వ్యక్తి సోషల్ మీడియాలో తెగ హల్ చల్ చేస్తున్నాడు. రవితేజకు అచ్చం జిరాక్స్ కాపీలా కనిపిస్తోన్న అతనెవరో తెలియదు కానీ వీడియో మాత్రం నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. ఇది చూసిన నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. రవితేజ సినిమాల్లో ఇతనిని డూప్ గా పెట్టుకోవచ్చు కదా అని కామెంట్స్ పెడుతున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. ఈ ఏడాది సంక్రాంతికి భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాతో ప్రేక్షకుల ముందుక వచ్చాడు రవితేజ. ట్రయాంగిల్ లవ్ స్టోరీగా తెరకెక్కిన ఈ సినిమా ఓ మోస్తరుగా ఆడింది. ప్రస్తుతం ఇరుముడి అనే ఓ డివోషనల్ మూవీలో నటిస్తున్నాడు మాస్ మహరాజా. నిన్నుకోరి, మజిలీ వంటి ఫీల్ గుడ్ సినిమాలను తెరకెక్కించిన శివ నిర్వాణ ఈ మూవీని తెరకెక్కిస్తున్నాడు. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్ గా నటిస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయ్యింది. ఆగస్టు 21న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

# రికార్డ్ ఫిఫ్టీ బాదినా బుడ్డోడికి దక్కని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు..







జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో టీమిండియా 7 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ సాధించింది. 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ కేవలం 18 బంతుల్లోనే ఫాస్టెస్ట్ ఫిఫ్టీ బాది ప్రపంచ రికార్డు క్రియేట్ చేసినప్పటికీ, మ్యాచ్ విజేత (ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్) అవార్డు మాత్రం స్పీడ్‌స్టర్ మయాంక్ యాదవ్‌కే దక్కింది. 126 పరుగుల లక్ష్య ఛేదనలో భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. సీనియర్ ఓపెనర్ అభిషేక్ శర్మ కేవలం 1 పరుగుకే అవుటయ్యాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలోని వికెట్ బ్యాటింగ్‌కు ఎంతో కష్టతరంగా మారింది. బంతి అనూహ్యంగా ఎగిసిపడుతూ, కొద్దిగా స్వింగ్ అవుతుండటంతో బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా శ్రమించారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ వైభవ్ సూర్యవంశీ ఏమాత్రం భయపడకుండా జింబాబ్వే బౌలింగ్‌ను చితక్కొట్టాడు. 50 పరుగులు సాధించి భారత్‌ను విజయతీరాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు.

**మయాంక్ యాదవ్‌కు అవార్డు ఎందుకు దక్కింది?**

అయితే, మ్యాచ్ ముగిసిన తర్వాత అందరూ వైభవ్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' వస్తుందని భావించారు. కానీ ప్రెజెంటేషన్ వేడుకలో మయాంక్ యాదవ్‌ను ఆ అవార్డు వరించింది. దీనికి ప్రధాన కారణం.. భారత్ విజయోత్సాహానికి అసలైన పునాది వేసింది మయాంక్ బౌలింగే కావడమే. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన ఈ యంగ్ పేసర్, ఇన్నింగ్స్ తొలి బంతికే డేంజరస్ బ్యాటర్ బ్రియాన్ బెన్నెట్‌ను అవుట్ చేసి జింబాబ్వేను భారీ దెబ్బ కొట్టాడు.

**పవర్‌ప్లేలోనే జింబాబ్వే నడ్డి విరిచిన మయాంక్..!**

పవర్‌ప్లేలో వరుసగా 3 ఓవర్లు వేసిన మయాంక్ యాదవ్, కేవలం 10 పరుగులు మాత్రమే ఇచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టాడు. మొత్తం తన 4 ఓవర్ల కోటాలో 18 పరుగులిచ్చి 2 వికెట్లు సాధించాడు. అందులో ఏకంగా 14 డాట్ బాల్స్ ఉండటం అతడి కట్టుదిట్టమైన బౌలింగ్‌కు అద్దం పడుతోంది. హరారే పిచ్‌పై జింబాబ్వేను కేవలం 125 పరుగుల స్వల్ప స్కోరుకే పరిమితం చేయడంలో మయాంక్ బౌలింగ్ అత్యంత కీలకంగా మారింది. ఈ బౌలింగ్ ప్రదర్శనే ఛేదనలో వైభవ్ సూర్యవంశీపై ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడేందుకు దోహదపడింది. వైభవ్ సూర్యవంశీ తన మెరుపు బ్యాటింగ్‌తో అభిమానుల మనసు గెలుచుకున్నప్పటికీ, మ్యాచ్ గతిని మార్చి జింబాబ్వేను కోలుకోలేని దెబ్బ కొట్టినందుకే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ పురస్కారం మయాంక్ యాదవ్‌ను వరించింది. ఈ ఇద్దరు యువ నక్షత్రాల ప్రదర్శన భారత క్రికెట్ భవిష్యత్తుపై కొండంత నమ్మకాన్ని పెంచింది.

# కామన్వెల్త్ గేమ్స్.. భారత్‌కు తొలి పతకం ఖాయం



స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా కామన్వెల్త్ గేమ్స్ ప్రారంభం రోజే భారత్‌కు తొలి పతకం ఖాయమైంది. బాక్సింగ్‌లో మహిళల 75 కేజీల విభాగంలో లవ్లీనా బొర్గొ హెయిన్ నేరుగా సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. దీంతో లవ్లీనా భారత్‌కు కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసింది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఐదుగురు బాక్సర్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో డ్రాలో లవ్లీనాకు బై లభించింది. బొర్గొ హెయిన్‌తోపాటు మరో ఇద్దరు నేరుగా సెమీస్‌కు అర్హత సాధించారు. మిగిలిన ఇద్దరు బాక్సర్లు ఏకైక క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడతారు. జులై 31న జరిగే సెమీ ఫైనల్‌లో తువాలుకు చెందిన టీకేబీపీ తాఫాకీతో లవ్లీనా తలపడనుంది. ఇందులో గెలిచిన వారు స్వర్ణ పతక పోరుకు అర్హత సాధిస్తారు. కెరీర్‌లో ఎన్నో ప్రతిష్మాత్మక టోర్నీల్లో పతకాలు సాధించిన లవ్లీనాకు కామన్వెల్త్ క్రీడల్లో ఇదే తొలి పతకం కావడం విశేషం. అస్సాంకు చెందిన ఈ బాక్సర్ టోక్యో ఒలింపిక్స్ (2020)లో కాంస్య పతకం (69 కేజీల విభాగం), 2023 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం (75 కేజీలు) సాధించింది. 2022 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, 2023 ఆసియా క్రీడల్లో రజతంతో మెరిసింది.

# విద్యార్థుల ఆందోళనల వేళ సచిన్ ఆసక్తికర పోస్టు



నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న వేళ క్రికెట్ దిగ్గజం సచిన్ 'ఎక్స్'లో ఓ ఆసక్తికర పోస్టు పెట్టారు. "మా నాన్నగారు ప్రొఫెసర్. ఆయన ఎంతో మంది యువ విద్యార్థులకు మార్గదర్శిగా ఉండేవారు. 'ఫెయిల్యూర్ ఓకే.. ఛీటింగ్ కాదు.. ఎప్పుడూ షార్ట్‌కట్‌లను అనుసరించవద్దు' అని నా చిన్నతనంలోనే చెప్పారు. సమాజంలో పెద్దలుగా సంస్కృతిని తీర్చిదిద్దే బాధ్యత మనపై ఉంది. శ్రమ కంటే ఫలితాలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే సమాజం.. ప్రతిభకు బదులుగా అడ్డదారులను వెతుకుతుంది. ఈ రోజుల్లో విద్యార్థులు తమ కష్టానికి తగిన ప్రతిఫలం లభించలేదని నిరాశ చెందితే.. అది అర్థం చేసుకోదగినదే. కాకపోతే, వారు మళ్లీ ఇలాంటి భావనకు గురికాకుండా చూసేందుకు మనమందరం కలిసికట్టుగా కృషి చేయాలి. కష్టానికి తగిన ప్రతిఫలం లభించేలా, ప్రతిభకు పట్టం కట్టే సంస్కృతిని సృష్టించాలి. మన పిల్లల భవిష్యత్తును బలోపేతం చేసి వారి ఆకాంక్షలను కాపాడే పరిష్కారాలను మనమందరం కనుగొంటామని నాకు నమ్మకం ఉంది. జై హింద్!" అని ఎక్స్‌లో రాసుకొచ్చారు.






VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com